శ్రీ శారదాంబాయై నమః



శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

ప్లవంగ - జ్యేష్ఠాషాఢములు

సంపుటము 56 సంచిక 2

★

సంపాదకుడు

కాకరపర్తి కృష్ణశాస్త్రి.

శ్రీ శారదాంబాయై నమః



శ్రీ

ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక

ప్లవంగ - జ్యేష్ఠాషాఢములు

సంపుటము 56 సంచిక 2

★

సంపాదకుడు

కవికంఠీరవ, కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర, విద్వత్కవివర,
బ్రాహ్మీభూషణ కాకరపర్తి కృష్ణశాస్త్రి.

సంవత్సరమునకు చందా
రు 3/-

విడిప్రతి
0-60 పైసలు

ఆంధ్రసాహిత్యపరిషత్తు

ప్రతిష్ఠాపకులు :

ఆంధ్రభోజ, మహారాజ,

శ్రీ శ్రీ శ్రీ రావు వేంకటకుమార మహీపతి సూర్యారావు బహద్దరువారు సి. బి. ఇ., డి. లిట్, పిఠాపురము మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ వేంకటగిరి మహారాజావారు.

శ్రీ శ్రీ శ్రీ బొబ్బిలి మహారాజావారు.

వ్యవస్థాపకులు :

శ్రీ జయంతి రామయ్యగారు

ఉద్ధారకులు :

శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావు బహద్దరువారు, జమీందారు, ఉయ్యూరు.

ఆంధ్రసాహిత్య పరిషత్తు (రిజిష్టర్డు)

కా కి నా డ

అ ధ్య క్షు లు

విమర్శకాగ్రేసర ఐతిహాసికసమ్రాట్

శ్రీ బండారు తమ్మయ్యగారు

ప్రధానకార్యదర్శి, కోశాధికారి

అ భి న వ భో జ

శ్రీ దంటు భాస్కరరావుగారు

సహాయ కార్యదర్శి

కవిశిరోమణి, ఉభయభాషాప్రవీణ (A)

శ్రీ దువ్వూరి సూర్యనారాయణశాస్త్రిగారు

కార్యనిర్వాహక సభ్యులు

1. శ్రీ కోకా శివనాథశాస్త్రిగారు
2. బాలవ్యాస, శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు
3. భాషాప్రవీణ, వ్యాకరణ విద్యాప్రవీణ
   శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు
4. కవిమూర్ధన్య, ప్రౌఢకవిచంద్ర
   శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రిగారు
5. శ్రీ కుందూరి ఈశ్వరదత్తుగారు, బి. ఏ;
6. శ్రీ జయంతి బుచ్చిరామశర్మగారు
7. శ్రీ చిరువోలు కోటేశ్వరరావుగారు
8. శ్రీ దామెర రాజగోపాలరావుగారు, బి. ఏ;
9. శ్రీ వేదుల రామచంద్రకీర్తిగారు, ఎమ్. ఏ; (ఆనర్సు)
10. సాహిత్యవిద్యాప్రవీణ, ఉభయభాషాప్రవీణ
    శ్రీ ఓలేటి వెంకట సుబ్బరాయశాస్త్రిగారు
11. శ్రీ కావలి శ్రీరామమూర్తిగారు, బి. ఏ., బి. ఎల్;

విషయసూచిక

ప్లవంగ ♦♦♦ జ్యేష్ఠాషాఢములు

సంపుటము ౪౮ సంచిక ౨

గ్రీష్మ ఋతువు

(జ్యేష్ఠాషాఢములు)

క. ఆవిర్భవించె నీల గ్రీవాలికకేలికేల కేవలసఖమై
పూవులకా రుడివోవంగా వేసవి హాసవిపులఖరకర మగుచున్
— తెనాలి రామకృష్ణుఁడు.

* * *

మ. దవధూమంపుఁదమంబులోఁ దమరస ద్రవ్యంబుఁ బంకేజబాం
ధవు భానుప్రతతు ల్హరింపఁ గుయివెంట న్వెళ్లుశూన్యోరుకూ
పవితానం బనఁ జూడఁ జూడఁ బుడమిన్బాటిల్లి పైవివ్వలై
యవసం బంచుల నాడఁగా నెగసె వాత్యాళి నిజశ్చక్రిముల్.

సీ. పవలెల్ల దీర్ఘికాంబువు చల్లుపోరాట
నలసి, మృణాళికాజడము లైన
బాహువు లత్తమదుకూర్పరముల కెదురుగా
మలఁచి మూఁపులఁ గరతలము లునిచి,
పాల్మాలి మిగుల నార్పనికమ్మకొ్రమ్ముడిఁ
దనిమొగ్గ విరవాది దండ విరియ,
ధౌతగంధామోదిశీతలస్నానములు
వాండఁ గాగిళ్లతో బోరగిల్లి,

తే. నారికేళాసవపుఁ దీపుటూరు పొలయ,
వలిపెపయ్యెంటకొల్లతో నురస్థలులఁ గూర్కు-
ప్రియులవేకువఁదోడ నెచ్చరించి కలసి
రెలమి ధన్యులు దఱిపివెన్నెలబయళ్ల.

శా. తారుణ్యాతిగమాతన్మాత్న ఫలయు
క్తైలాభిఘారస్వన
ద్ధారాధూపితశుష్యదంబుహృతమా
త్స్యచ్ఛేదపాకోద్గతో

ద్గారంపుంగనరార్చుభోగులకు సం
ధ్యావేళలం గేళికాం
తారాభ్యంతరవాలుకాస్థితహిమాం
తర్నారికేళాంబువుల్.

—శ్రీకృష్ణదేవరాయలు

* * *

చ. మలయజవారిసేకములు
మౌక్తికనూతనహారలీలలన్
వలిపెపుసన్నకావులను
వారిరుహోక్షుల వీఁగుచన్నులన్
గలిగిన చల్విరిం బ్రదికెఁ
గాక జనావళి యిట్టివేసవిన్
గలదె శరణ్యమన్యమనఁ
గాఁ గడుఁ బేర్చె నిదాఘదాహముల్.

మ. హరి యంభోనిధి సొచ్చె శంభుఁడు తుషా
రాద్రీంద్రముం బ్రాకెవా
గ్వరుఁ డుద్యన్మకరందదుర్దినసమ
గ్రం బైనయుత్పల్లపం
కరుహంబున్ భజియించె దీని మును గ
ల్గం గాంచియే కాక యె
వ్వరి నింకేల సహించు గ్రీష్మ మనఁగా
వర్ధిల్లెఁ దాపోద్ధతుల్.

—పరిబంధపరమేశ్వరుఁడు

* * *

వ్యాసరచనము

డా. బి. వి. కుటుంబరాయ శర్మ

(గత సంచికానుబంధము)

మొత్తమునీద "ఎస్సేయ్"[3] అను పదమును వాడుక చేసిన వారిలో మాంటేగ్ ప్రప్రథముఁడు. "ప్రియత్నము, కృషి. యని యాతఁడు దానిని నిర్వచించినాఁడు. ఆంగ్లమున నాపదమును నేఁటికిని విశేషముగను క్రియగను కూడ వాడుకచేయుదురు. అనగా, "ప్రియత్నము ప్రయత్నించుట" యను రెండర్థములయందును దానికి వ్యవహారము కలదు. ఈ "ఎస్సేయ్" అను పదమునకు "ఎగ్జ్యాజియమ్"[4] అను ల్యాటిన్[5] పదమునుండి నిష్పత్తి చెప్పుదురు. (విషయములను) "తులతూఁచు" (పర్యాలోచనముచేయు) సరి తూఁగునట్లుచేయు అని యా ల్యాటిన్ పదమున కర్థము.

(1) ఎరిస్టాటిల్[6] పండితుఁడు తననీతిశాస్త్రములో[7] నాదర్శమానవుని చిత్రించినాఁడు. ఆ చిన్నచిత్రణము, లేక రేఖాచిత్రము వ్యాసమే! కాని, దానికెవ్వరు నట్లు పేరిడఁ జూడలేదు; ప్రయత్నింపలేదు.

(2) క్రీ.శ. 287లో స్వర్గస్థుడైన "థియోఫేస్టిటస్"[8] తన "క్యారక్టర్సు"[9] అను గ్రంథములో శతాబ్దులు దాఁటిన తర్వాతకూడ ఎరిస్టాటిల్ పద్ధతినే యనుసరించి భిన్నభిన్నవ్యక్తి విశేషములను విశ్లేషించి పరీక్షించినాఁడు.

(3) బేకన్[10] మహనీయునకు సమకాలికుడైన "ఓవర్‌బరీ"[11] పండితుడు కూడ ఎరిస్టాటిల్ మార్గమునే యనుసరించెను.

(4) "సెనికా"[1] మహోదయుఁడు రోమ్‌దేశపు మహాతత్త్వజ్ఞాని ఇతడు "మోరల్ఎపిసిల్స్"[2] అనుపేరిట కొన్ని నీతిదాయకలేఖలను రచించినాఁడు. క్రీ. శ. 1612 కూర్పులో తన వ్యాసముల పీఠికయందు

---

3. Essai; 4. Exagium; 5. Latin; 6. Aristotle; 7. Ethics; 8. Theophrstus; 9. "Characters" 10. "Bacon" 11. "Overbury".

1. Seneca; 2. Moral Epistlse (Epistles to Lucilias);

"బేకన్" పండితుఁడు "సెనికా" రచించిన లేఖలను వ్యాసములని పేర్కొనెను.

పరిశీలింపగా పిండితార్థ మిట్లు తేలుచున్నది. మాంటేగ్ మహనీయుఁడు పాశ్చాత్యప్రపంచ వాఙ్మయములో ప్రప్రథమవ్యాసకర్త. క్రీ. శ. 1533 నుండి 1592 వఱకు నీతని జీవితకాలము సువ్యాప్తము. పుట్టుకచే నీతఁడు ఫ్రెంచిదేశస్థుఁడు. ఆతండ్ల బాలుఁ డగువఱకు నీతఁడు "ల్యాటిన్" భాష వినా తదితర భాష లేమియు మాటాడియెఱుఁగఁడు. పెరిఁగి పెద్దవాఁడైన పిదప నీతఁడు న్యాయశాస్త్ర మధ్యయనము చేసెను. రెండవ ఫ్రాన్సిస్[3] రాజు కాలములో నతని న్యాయస్థానము నందీతఁడొక రాజోద్యోగి; రాజశయనాగార రక్షక దళాధికారి. ఇతఁడు క్రీ. శ. 1571లో "స్కాటుదేశపు మేరీరాణిని" ప్రశంసించినట్లు తెలియుచున్నది.

ఇతనికి నిర్వురు జ్యేష్ఠసోదరులు. వారీతనికంటె ముందుగనే మరణించిరి. ఉద్యోగవిరమణానంతర మితఁడు తన కుటుంబమున కున్న "భూవసతి" ననుభవించుచు కాలముగడిపినట్లు విదితముకాఁగలదు. ఉద్యోగమును విరమించుదశలో తన మాన్యక్షేత్రములోని గృహమునందు విశ్రాంతిగ కూర్చుండి మాంటేగ్ మహనీయుఁడీ వ్యాసప్రక్రియను రచించినట్లు తొలుదొలుతగ కొందఱివలుకు. ఇటలీదేశమునఁ బుట్టియునాంగ్లేయుఁడుగానంగీకరింపఁబడిన "జాన్ ఫ్లోరియో"[5] యనునతఁడు క్రీ. శ. 1593 ప్రాంతమున తొలిసారిగ "మాంటేగ్" వ్యాసావళిని వ్యావహారికాంగ్లములోని కనువదించినాఁడు.

"మాంటేగ్" పండితుని ఫ్రెంచిభాషాశైలి పరిణతమైనది; కాని జాన్ఫ్లోరియామహాశయుని యనువాదములోని వ్యావహారికాంగ్లము మాత్ర మట్టిదికాదని టి. యస్. ఇలియట్[6] విమర్శకునివంటి తజ్ఞులందురు.

---

3. Francis II; 4. "Gentleman of the bed-chamber";
5. John Florio 6. T. S. Eliot.

"వ్యాస" మనెడియీ నవీనసాహిత్యప్రక్రియ పాశ్చాత్య లోకమునందు సరిగ నేనాఁ డవతరించినదో చెప్పుట దుస్సాధము సత్యమున కించుక సన్నిహితముగ దీనికాలమును నిర్ణయించుటకు ప్రయత్నములు తఱచుగ జరిగినవి కాని యవి యంతసఫలీకృతములు కాలేదు.

ఐనను క్రీ. శ. 1571 మార్చినెలలో నీవ్యాసమనెడి సాహిత్య రూపము సృష్టింపఁబడినదనవచ్చును. మాంటేగ్ పండితునిశిథిలసౌధ మున[1] రెండవయంతస్తులో నిదిజరిగినది. ఆయంతస్తునందు మనతాత్త్వి కుడైన మాంటేగ్ మహోదయుని పఠనాగారము కలదు. చదువుకొను నిమిత్తమై బహుగ్రంథసంకీర్ణమగు నాగదిలోని కాతఁడు ప్రవేశించుట పరిపాటి అది తమ (క్రైస్తవుల) చిన్నగుడికి సమీపమున నుండుట వలన జనబాహుళ్యముచే సంకుల సమ్మర్దమగు లోకమున కించుక దూరముగ నేర్పడియున్నది.

"ఎడ్వర్డు గాస్"[2] ప్రభృతులనుబట్టియు వ్యాసమను ప్రక్రియ ఫ్రెంచిదేశస్థుఁడగు మాంటేగ్ తత్త్వజ్ఞుని మేధాజనితమే! ఈమాంటేగ్ పండితుఁడు విద్యావ్యాసంగము నిమిత్తమై యుద్యోగవిరమణకాలము రాకమునుపే బుద్ధిపూర్వకముగ నుద్యోగమునుండి విరమించుకొని సాహితీవిశ్రాంతి పఠన నిమగ్నుఁడై వ్యాసరచనావ్యవసాయము మూలమున రానున్న తరములవారికి తన వ్యక్తిత్వమును వెల్లడిచేయ నుత్సహించినట్లు విదితము కాఁగలదు. అనర్ఘమైన యీ సాహిత్య ప్రక్రియను ఫ్రెంచిభాషలో సృజించి తన్మూలమున తన ముగ్ధమనో హరవ్యక్తిత్వము నాతఁడభివ్యక్తము చేసినాఁడు.

బేకన్ :—

ఆంగ్లమున వ్యాసరచనకు పితృవ్యుఁడనఁబడిన[3] బేకన్ పండి

1. Old Tower of the Castle of Montaigue; 2. Edward Gosse; 3. The Father of the English Essay;

తుఁడు, మాంటేగ్ తత్త్వజ్ఞుని వ్యాసరచనము నాంగ్లములో మొట్ట మొదట ననుసరించెను. కాని బేకన్ తత్త్వతః వ్యాసకర్తలలో నుత్తముఁడు కాఁడు. అతఁడు మహాతత్త్వజ్ఞుని; ఉదాత్తశైలీ (రీతి) నిర్మాత; మాంటేగ్ పండితునంతటి భూతదయామయుఁడు మాత్రముకాఁడు.

కౌలే :—

ఎడ్వర్డ్ గాస్ మతమున "అబ్రిహం కౌలే" [4] మహనీయుఁడుయథాగముగ ప్రసిద్ధమాంగ్ల వ్యాసకర్త. అతఁడు కొంతగమాంటేగ్ మహోదయుని మానవత్వము వంటి (a) మానవత్వమును, బేకన్ పండితుని శైలివంటి (b) నిర్దుష్టశైలియు, తనయొక్క నీయములైన వ్యాసములలో పొందుపఱచెను. అతనికి వ్యాసకర్తకుండవలసిన లక్షణములన్నియు నుండితీరిన వనరాదు. (c) పరిహాసకుశలత యాతని రచనలో నిప్పచ్చరము; (d) ప్రసన్నత పూజ్యము; (e) సరళమైన గాన మాధుర్యము కలదు; (f) ఆత్మాభివ్యక్తియు నున్నది. వ్యాసరచనమునకు సంబంధించి సంతవఱకు "రిచ్చర్డ్ స్టీల్" 1 గ్రంథములలో పదునేడవ శతాబ్ది, పదునెనిమిదవ శతాబ్దిలో నంతర్లీన మగుట పొడగట్టును. అతని రచనలన్నిటిలోను మానవత్వ సౌరభము గుబాళించుటకలదు. తన సమకాలీనుల యందఱియందు కంటె నీతనియందెక్కువ (a) సానుభూతి పరతయు, (b) లోకవ్యవహార పరిచయజ్ఞానమును (c) పొంగారు హాస్యకౌశలమును గలవు.

ఎడిసన్ :—

"కౌలే" పిమ్మట నెన్నదగినవాఁడు "ఎడిసన్" మహనీయుఁడు ఇతఁడు పదునెనిమిదవ శతాబ్దియందు పత్రికా సంపాదక వ్యాసకర్తలలో నగ్రగణ్యత్వము వహించెను.

పదునెనిమిదవ శతాబ్ద్యంతమున నాంగ్ల వ్యాసరచన తాను, తనకు ముందు వెనుకల నెన్నఁడు నందుకొని యెఱుఁగని యొక పరి

---

4. Abraham Cowly. 1. Richard Steele;

పూర్ణదశ నందుకొన్నది. కాని, చక్కని వ్యాసములు రచించిన వారా శతాబ్దిలో చాల తక్కువ. ఐనను "ల్యాంబ్"[2] హ్యాజ్ లిట్,[3] లీహంట్,[4] డీక్వెన్సీ,[5]ల" వంటి మహనీయులప్పుడు వ్యాసరచయితలుగా వన్నెకెక్కి వర్ధిల్లక పోలేదు.

పైనల్వురిలో "లీహంట్" మనోజ్ఞముగ వ్రాయఁగలఁడు కాని, యాయింపు గొలుపు రచనలలో మిక్కిలి యసాధారణమైన విశేషమని చెప్పఁదగిన దేదియు నుండదు. "డీక్వెన్సీ"యచ్ఛమైన వ్యాసకర్త అయినను నట్టి స్వచ్ఛతాశోభితములగు వ్యాసముల నాతఁడు రచించినదే యరుదు. అతఁడు తన వచన రచన నంతయు తీక్ష్ణమగువిమర్శనల దెసగా మరలించెను. అందును చాల భాగములలో చోద్యములగు కల్పనలున్నవి.

"హ్యాజ్ లిట్" వ్యాసములు చాలవఱకు స్వచ్ఛములగురచనలు వ్యాసమునకుఁ బ్రధానభూతములగు సౌలభ్యమును సుందరగమనలాఘవమును నను రెండు లక్షణములలో నవి నంతు తేలినవి. పైరెండంశములయందును హ్యాజ్ లిట్ పండితుఁడు ల్యాంబ్ మహనీయుని కంటె కూడ పరిపూర్ణుఁడన్నచో తప్పుకాదని కొందఱి వాదము. ల్యాంబుమహోదయుని, ప్రతిభామూర్తిభవ మనవచ్చును. అతని రచనలలోని సహనగుణమును, సానుభూతియు, నుల్లాసకరత్వమును, ప్రసన్నతాగుణమును, చతురోక్తి సామర్థ్యమును, మార్గవానుగతియు, ఆశక్తి ప్రేరకత్వమును. శ్లాఘనీయములైనవి. ఆతనిది కేవల మసాధారణమైన మేధాశక్తియే కాదు; అది యనర్ఘమైనదియు, నపారమగు వ్యాలోచ సామర్థ్యమును గలదియు ననవలెను.

ల్యాంబుపండితుని వ్యాసములను విమర్శించుటబహుదుస్సాధము అవిశైలీ సారళ్య లాలిత్యములకు పేరు మోసినవి. వాని శిల్ప సౌందర్యము ప్రౌఢమైన పరిణతిఁగలది. అట్టివ్యాసరచన మనన్య సాధ్యమని

---

2. Lamb; 3. Hazlitt; 4. Leigh Hunt; 5. Dequincy.

పించును. దాని పరిపూర్ణతను దృష్టాంతీకరింపఁ జూచుట యపాయకరమైన పని. ఏలన సందుల కాతని ప్రతివ్యాసమును నుదాహరింపవలెనని పించును. ఆ వ్యాసములనన్నిటిని పృథక్కరించి వాని వాని శ్రేష్ఠతల నేర్చి తీర్చుటలో నెంతవారికిని దిగ్భ్రమ తప్పదు. వానిలో వెలుఁగు నీడల యంతరము లనంతములై యున్నవి. పాఠకుల నతఁడే భావస్థితిలో మంత్రముగ్ధుల నొనర్చునో నిర్ణయించి చెప్పుట కడు సాహసము. అతనికి బూర్వాపరములలో నున్న వ్యాసకర్తలు కొన్ని ప్రశస్త గుణములలో, నతనితో సాటివచ్చిరి. కాని, సర్వతోముఖ సంపూర్ణతలో నతఁడ ద్వితీయుఁడే యనఁదగును.

ల్యాంబ్ తర్వాతఁబూర్తిగ నతనితో సరిపోల్చ యోగ్యుఁడని చెప్పఁదగిన వ్యాసకర్త యొక్కఁడును లేఁడనవచ్చును.ఎవ్వరేనియొక్క "స్టివెన్‌సన్" పండితునిజూపి, యతఁడున్నాఁడని యనివచ్చునేమో కాని యత.డు "హ్యాజ్‌లిట్" తెగలో జేర్పఁదగిన రచయిత, పందొమ్మిదవ శతాబ్ది, మెకాలే, ఆర్నాల్డ్, కార్‌లైల్, రస్కిన్, వాల్టర్ పేటర్, జె. ఎ. సైమండ్స్" వంటి వ్యాసరచనా ప్రవీణుల నెందఱనో యవతరింపఁజేసిన దైనను, వారిలో నొక్కరిని గూడ సల్లక్షణలక్షితుడైన వ్యాసకర్తయని మనము నిష్కర్ష చేసి చెప్పలేము.

ఎడనెడ విరుద్ధములగు తళుకు బెళుకుల తోడను నైంద్రజాలిక వైభవములతోడను కొనసాగునట్టి మెకాలే మహనీయుని చారిత్రకములును సాహిత్యకములును నగు విపుల విమర్శనలు, మానవ జ్ఞానభాండారమునకుఁగూర్చునవిఁ కావు. "కార్లైల్, రస్కిన్" పండితుల విషయము నిట్టిదే! వారి వాగ్ధాటిగల ప్రసంగ ములనుసందర్భ సంబద్ధములుగానివచన కావ్యములనవలెనుగాని వ్యాసరచన లనరాదు.

"స్టివెన్‌సన్" పండితునిలో వ్యాసకర్తకు కావలసిన సత్తా నిశ్శంకముగ నున్నది. విశాలహృదయమున కుండు నట్టి యార్ద్రతయు, నపారజిజ్ఞాసయు నతనికిఁగలవు. మిక్కిలి శ్రద్ధతో పరిష్కృతమైనను

అతని శైలిలో నిరుత్సాహకము దుర్బోధకము ననిపించునదియుండదు. అతని యుత్తమవ్యాసములు పఠించుటకును స్మరించుటకును గూడ నుల్లాసము గొల్పుచుండును. "వాకింగ్ టూర్స్[1]" గాని, "ట్రావెల్స్ విత్ ఏ డాంకీ"[2] లోని కొన్ని భాగములుగాని, యాంగ్లవ్యాస కర్తలలో నతనిని ప్రథమశ్రేణికిఁ జెందినవాఁడని నిరూపింపఁగలవు. అయ్యు నితఁడెల్లప్పుడు నాయుదాత్తతనే నిర్వహించునని చెప్పలేము. వినసొంపుఁ గొల్పియు, జ్ఞప్తిలో నిలువని వ్యాసము లాతనివి కొల్లలు.

ఆధునికవ్యాసకర్తలలో "మాక్స్ బీర్ బోమ్"[3] "జార్జిస్ట్రీట్"[4] "జి. కె. చెస్టర్ టన్"[5] "బెలాక్"[6] "ఇ. వి. లూకాస్"[7], "ఛార్ల్స్ విబ్లే"[8] "వెర్ నన్ లీ"[9] ప్రభృతులు పేర్కొనఁదగినవారు. వీరిలో ప్రథముఁడగు "బీర్ బోమ్" మహాభాగునకు వ్యాసకర్తృ గౌరవమును నిరాకరించువారుండరు. అతని రచనలు మెఱుఁగు దీసెడి కళాఖండములు. అందు మనోజ్ఞమైన వైచిత్ర్యమనుగుణము సర్వత్ర గుబాళించును. సుందరమైన భావశబలతకూడ నాతని రచనాలక్షణములలో ప్రత్యేకతఁగన్న లక్షణము. "స్ట్రీట్" మహాశయుని వ్యాసములకువలె సాహిత్యకముతో గౌరవము గలవగుటకూడ వానివిశిష్టత. "బెలాక్" "చెస్టర్ టన్" పండితులు గంభీరతరచింతనాపరులగుట సత్యము.

"చెస్టర్ టన్" నకు విరోధాలంకారములు ప్రత్యేక వరప్రసాదములు. దేశద్రిమ్మరితనములో వ్యక్తమగు విషయముల వర్ణనమునందు "బెలాక్" అద్వితీయుఁడు. చదువరులలో గిలిగింతలనంటుగొల్పు పరిహాసకౌశల మిద్వురకును వెన్నతో బెట్టిన విద్య. "లూకాస్" రచనలు, ల్యాంబ్ మహనీయుని కొన్ని భావభంగిమల సౌరభమును విరజిమ్మును. తన వాక్యముల పరిసమాప్తి విషయమునందు కూడ శ్రద్ధధానతఁ జూపిన సందర్భములలో "విబ్లే" నైపుణ్యము సుస్పష్టము.

---

1. "Walking Tours;" 2. "Travels with a Donkey;" 3. Max Beerbohm; 4. "George Street; 5. G. K. Chesterton; 6. Belloc; 7. E. V. Lucas; 8. Charles Whifley; 9. VernonLee.

దీర్ఘ నిశ్వాసములతో నభినందనములలోనికి దిగినవ్వాడు తప్ప, తక్కిన సందర్భములలో తన విశిష్టమార్గమున "జెర్సన్‌లీ" సతి కించిదూన ముగఁబరిపూర్ణురా లనిపించుకొన్న వ్యాసకర్త్రి.

'ల్యాంబ్,[1] హ్యాజ్‌లిట్,[2] హంట్[3], గోల్డ్‌స్మిత్[4], స్టీవెన్‌సన్[5]' ప్రభృతుల వ్యాసము లాత్మాశ్రయములు. బేకన్[6] మహాభాగునియం దట్లుకాదు. కాని యాతఁడు వ్యాసరచనము నొక నీతివాక్యమాలా రచనముగా జేసివేసినాఁడు. "బేకన్" కొన్నిరీతులలో "మాంటేగ్" మహాశీయు ననుసరించెను. "మాంటేగ్" తలచు స్వవిషయము నే వ్యాసవస్తువుగా స్వీకరించితినని చెప్పుట కలదు. ఆత్మానుభవ జ్ఞానములను ప్రపంచించుటకై "బేకన్" బహుధా చాటూక్తి చాతుర్యచణ మైన శైలి నవలంబించినాఁడు.

పదునేడవ శతాబ్ది వ్యాసకర్తలలో "ఓవర్‌బరీ"[7], "కౌలే"[8], "టెంపుల్"[9], "డ్రైడన్"[10], మొదలగువారు ప్రసిద్ధులు. "ఎడిసన్"[11], "స్టీల్"[12], "గోల్డ్‌స్మిత్" వంటివారి చేతులలో వ్యాసరచనము, వినోద విజ్ఞానములకు సాధకమయ్యెను. అంతేకాదు. గురువతనముతో పాటు నైపుణ్యమునుగూడ నది సంతరించుకోలేదు.

పందొమ్మిదవ శతాబ్ది వ్యాసకర్తలగు "హ్యాజ్‌లిట్, ల్యాంబ్, హంట్" వంటి మహానుభావులు, వ్యాసరచనకు గాంభీర్య మలవరచిరి. "కార్లైల్, మెకాలే, ఫ్రౌడ్,[13], ఆర్నాల్డ్, రస్కిన్" ప్రభృతులు దాని విషయ విస్తృతికి తోడ్పడి బహుదైర్ఘ్యవైపుల్యములచే, దానిని భారవహమొనర్చినారు.

"డీక్వెన్సీ"[14], తన్ను తాను పోలును. అతనికి తన యాలంకా

1. Lamb; 2. Hazlitt; 3. Hunt; 4. Gold smith; 5. Stevenson; 6. Bacon 7. "Overbury" 8. "Cowley" 9. Temple; 10. Dryden; 11 Addison; 12. Steel; 13. Froudi; 14. Dequncy.

రిక శైలి తనకున్నది; తన దాంభికవచస్సందర్భముగల సాహితీశైలి తనకున్నది; పీఠాభాస మనదగు తన హాస్యధోరణి తనకున్నది.

ఇఁక "హంట్, హ్యాజ్ లిట్, ల్యాంబ్" వంటి వారి వ్యాసరచనమునకును కొన్ని విశిష్టలక్షణములు కలవు. జీవితనిత్యానుభవసన్నిహితత్వమును, స్వీయ చరిత్రవైఖరియు, సంవాదశైలీపరిపోషణము, నుల్లాసకరత్వమును, ఖేలాతుల్యత్వమును, సారస్యమును, చమత్కృతియు, కరుణాస్ఫోరకత్వమును వెల్లడించుటయే గాక, వారి వ్యాసము ముచ్చటఁగొల్పు కొన్ని కొన్ని పరికథలవంటి వానిని గూడ కూర్చుకొనును.

శ్లోకము

గోష్ఠం తే విషమూవనీవిరచితం
తన్నాపరోధాయ తే
నాంభః పల్వలసంగతం కలుషితం
కుబ్జాకనీరాయ తే
భర్తా తే స నృపాయతే హి మహిషీ
నామైకసంధారణాత్
హృష్టా కిం కితవే పశో! హృది సదా
గర్వాయసే నిర్భరమ్.

[కవిమూర్ధన్య కృతవ్యాజవ్యాహారే]

సమస్య

"మామ నీక్షించి కడుదూఱె భీమతనయ"

---

* శ్లోకము నాంధ్రీకరించి సమస్యను బూరించి శ్రావణమాసాంతము దాటకుండ బంపగోరుచున్నాము.

—సంపాదకుఁడు.

శ్రీరామాయ నమః

శివ!

శ్రీ శిష్ట్లా బాలకోటీశ్వరరావు

మ. శివ! పోఁగాలము దాపురించినపుడే శ్రీకంఠ! సర్వేశ! భ
క్తవితానావనతత్పరా! పురహరా! గంగాధరా! యంచు భా
గ్యవిపర్యాసము గుండెగాల మయి సయ్యాటింప కోడింతు రీ
భవవారాన్నిధి నీఁదలేక మనుజు ల్వ్యామోహము ల్వీడుచున్. 1

మ. శివ! క్షేమంకర తావకీనకరుణాక్షీరమ్ముఁ గ్రోలంగ యో
గివరేణ్యుల్ నిరతమ్ము సమ్మదమునం గీర్తింతు; రస్మాదృశుల్
భవితవ్యం బెఱుఁగంగ నేరక కుటుంబం బంచు నల్లాడి నీ
రవులై రక్షకుఁ డేడి? యెక్కడని యారాటింతు రస్వస్థతన్. 2

మ. శివ! సంసారము స్వర్గతుల్య మని సూచింపన్ హితాకాంక్షు లా
నవు నంచుం దలయూఁచి నమ్మితి; దురాశావేశభూతమ్ము లా
త్మవికారమ్మును బ్రోత్సహింప నరకద్వారమ్మునం జిక్కితిన్;
జవసత్వమ్ములు సన్నగిల్లె; నిఁక నైనం బ్రోవ రారా వెసన్. 3

మ. శివ! యేమందును నిన్ను? నేడుగడవై చేయూఁత నందించు వే
ల్పువు; నాజీవనజీవనమ్మునకుఁ గర్పూరంపుసారథ్యముల్
సవరింపన్ జతనించు నేర్పరివి; యేలా నేఁ డుపేక్షించి న
న్నవమానంబులపా లొనర్తువు? పరీహాసమ్మె నీలక్ష్యమా?! 4

మ. శివ! కాపాడఁగలాఁడ వీ వని కదా చిత్తమ్ము నర్పించి శే
బవ లర్చించితి! తోడుదొంగ వయి దైవమ్మున్ సమర్థించి హ
ర్తవు గాఁబోకుము; భర్తవై నను విషాదగ్రస్తునిం గాచి పం
డువు గల్పింపుము నాదునింటఁ బరువుండు న్నీకు నీవారికిన్. 5

మ. శివ! నీ నామజపమ్ము సంతతము గాంక్షింతున్; హరిబ్రహ్మవా
సవవైశ్వానరభాస్కరాదిదివిజుల్ శ్లాఘించు త్వత్పావిజ్యవై
భవసర్వస్వము నా కొసంగు మని యభ్యర్థింప; న న్నింత లోఁ
కువగావించినదుర్విధి న్దునిమి సంక్షోభంబు వారింపుమా! 6

మ. శివ! నీసుందరమందహాసరుచికై జీవించి సేవించుమా
నవుఁడన్; మాయలు మర్మముల్ తెలియ నేనాఁడేనియు న్నిన్ను దా
యువిధానమ్మును సంగ్రహింతును మదాయుర్భాగ్య మక్షీణమై
న;విరాజిల్లుదు వెండికొండవయి నీనాట్యంబు దర్శించుచున్. 7

మ. శివ! నీమానము నోపఁజాలను; మహాచిత్రంబు నీతీరు-దా
నవుఁడైన న్నినుఁ గొల్చుచో నతఁడు నానాపాప్రభవోపేతుఁడా;
నవురా!! యెంతదయామయుండ విపు డేమాయెం ద్వదీయాద్భుత
స్తవనీయస్పృహణీయదీవ్యదురువాత్సల్యామృతం బింకెనా ?! 8

మ. శివ! నీప్రాకటదర్శనాసవము నాశింతున్ సదా; దాసబాం
ధవ!! యీ నీ బిరుదమ్ము సార్థకము గాదా? కాదు కాఁబోలు నై
న విషం బెందుల కారగించితివి? పుణ్యస్త్రీశిరోరత్నమై
న'విశాలాక్షి'ని రచ్చకీడ్చుటకు నౌనా! గుండె పాషాణమా ? 9

మ. శివ! కైలాసమనోజ్ఞసానువులలోఁ జిన్నారిపొన్నారిపా
యువు లామోదముఁ బుండలింప సతి నేదో చేసి మెప్పింపనే
ర్తువు! నిన్నే యిలువేల్పుగాఁ దలఁచుభక్తుల్ పిల్వ రక్షింపనే
రవు!! వహ్వా యిది యెంతవింత? ఫణిహారశ్రీవిభావంబకో!!! 10

మ. శివ! సామేనునఁ బార్వతి న్నిలిపి యాక్షేపించు గంగం గృపా
ళువవై యాదలమీఁద నిల్పి వలపుల్ పూరించి జాబిల్లి నా
మై వినోదార్థము లంచమిచ్చితివి! తాల్మి న్నిన్ను గాదన్నవాఁ
డెవఁ డున్నాఁడు రసజ్ఞలోకమున? నీయెత్తుల్ ప్రశంసార్హముల్ !!11

మ. శివ! ముక్కంటివి; వ్యాఘ్రచర్మ మొక కౌశేయమ్ము నీ! కంబికా
ధవ!! భూతమ్ములు నీదుసేవకులు; ప్రేతావాసమే మందిరం
బవునా? నీలగళుండ వేరికిని నీ యాంతర్య మర్థమ్ముగా
దు;విచారింతునుపూజనీయుఁడవొ కాదో యంచునశ్రాంతమున్. 12

మ. శివ! నీపాదము లాశ్రయించితిని నా శ్రేయస్సు సుంతైనఁ గో
రవు, కాపాడవు; చూడ వస్మదతిఘోరపాగ్ర్యవాఘౌఘసం
భవపైశాచికధూర్తవర్తనకళోన్మాదప్రమాదమ్ము మూఁ
డవకంటన్ - విడనాడు మింక నుబలాటం బేల న న్నేమఁగన్? 13

మ. శివ! క్రోధం బుపసంహరింపకుము దాక్షిణ్యంబు వర్జింపు మా
టవికం బ్రోచిన నాటి నీదు మొగమోటం బంబుధిం గల్పి ప్రా
శవిశాఖీలనిరంకుశప్రబలరోష ద్వేషదావాగ్నిప
ర్యవసానం బగుమృత్యుదేవత కరాళాలింగనం బీయుమా !! 14

మ. శివ ! నీవైఖరి తెల్లమాయెను సుమా! చేయూఁత నిమ్మన్న జం
కవు పల్ రీతులఁ దర్కకర్కశపరీక్షం జేయు; నాబోఁటి కం
దవు; వేదాంతవిశాలవీథులఁ బ్రయాణం బాచరింపంగ దా
గవు; కించిజ్జ్ఞుల కీవు త్రోఁగ విధియే కాదా నిజం బారయన్. 15

మ. శివ! భక్షించితి వీవు హాలహల ముత్సేకించి పార్థుండు గాం
డివముం బూని శిరమ్ము మోద వరము న్జల్లించి దీవించినాఁ
డవు; తిన్నం డనుకంపతో నిడిన కండ ల్మెక్కి యుప్పొంగినాఁ
డవు; నీలీలలు నే నెఱుంగుదు నె మూఢగ్రామణి న్బాలుఁడన్. 16

మ. శివ! నీయున్కి నిఁగూర్చి యే నెటులు వాచింతున్? బుధోత్తంసులే
వ్యవహారింతురు శైవవైష్ణవముల వ్యత్యాసముల్ రేపి; యి
ట్టి విభేదమ్ముల కాటపట్టయినమట్టిం బుట్టితిన్; వేదశా
స్త్రవిదుల్ కట్టిరి నీకె పట్టమును నిర్ధారించి యాధిక్యమున్. 17

మ. శివ! నాలోఁ గల నీస్వరూపమును వీక్షింతు న్నితాంతమ్ము; హే
తువు లేనైనను నీవె దిక్కనుదు నెంతుం గామితార్థప్రదా
తవు నాపన్నజనావనవ్రతవినీతస్వాంతవిఖ్యాతనే
తవు నిత్యుండవు నిర్వికారుఁడవు సత్యజ్ఞాత వందు న్నినున్. 18

కావ్యములందలి వారకాంతలు— వారికట్నములు

శ్రీ పలగాని గోపాలరెడ్డి M. Sc;

రెండు దశాబ్దములక్రితము దేవోత్సవములం దుండిన దేవదాసి నృత్యములు దేవదాసిచట్టముతో మఱుగైపోయినవి. "మేజవాణి లేని పెండ్లి యుప్పులేనికూర" యన్నది నాటి నుడి. కాలానుగతముగా వారుకూడ కులవృత్తి వదలుకొని గౌరవోపాధుల జేసికొని నవజీవనమున కలవాటుపడిరి. వేదకాలమున వీరి దొక గౌరవప్రదమైనజాతిగా పరిగణింపబడెడిది. విజయనగరమును దర్శించిన విదేశయాత్రికులు వేశ్యావేశనములు నగరమునందలి మధ్యవాడలలో గలవని వారివీథులలంకరణములతో నొప్పెడి వని వ్రాసియున్నారు.

స్కాంధపురాణమునుబట్టి "పంచచూడ" యను నచ్చరలేమ సంతతి వేశ్యజాతిగా నెలవొందినదని తెలిసెడిని. యాజ్ఞవల్క్యస్మృతిలో వెల తీసుకొని మారుగా నుత్తమ లేక సమజాతిపురుషుని గూడునది వేశ్యయని తెలుపబడియున్నది. తత్సంభోగసంజాతస్త్రీలు రాజాజ్ఞాబద్ధులని కౌటిల్యుని యర్థశాస్త్రవాదము. వేశ్యలను మున్నూఱుకులము వారనుట కొకయైతిహ్యము కలదు. విక్రమార్కుని సోదరుడు భర్తృహరి స్త్రీకుత్సితములకు రోసి మున్నూఱుభార్యలను విడచి తమ్మునిపై రాజ్యభార ముంచి వనముల కేగెను. అట్టివో

క. అన్నరనాథుడు విడచిన
యన్నులు మున్నూఱు లతనియనుమతి గలుగన్
మున్నూఱు చేసుకొని ధర
మున్నూఱుకులం బనంగ మొనసిరి సిరులన్ (సిం. ద్వా. 1 ఆ-104 ప

కీ॥ శే॥ సురవరము ప్రతాపరెడ్డిగారు తమయాంధ్రుల సాంఘిక చరిత్రలో (పుట 165) భీమవరమున నుండిన పెద్దమున్నూఱు చిన్నమున్నూఱు తెగలవేశ్యలు బహుశః పెద్దకమ్మ–చిన్నకమ్మ–పెద్దకాపు

చిన్నకాపులవలె సంలస్థుతారతమ్యమైయుండనోపు నెల్లూరు ప్రాంతమున నటునీటు చిక్కక మాటలాడు జాణలను నిందావాచ్యముగా మున్నీటికోటిదానా యనుటకలదు. నెలకున్నె దురోజులు విసర్జించి సంవత్సరమున మిగిలిన మున్నూటు దినములలో నంతమందితో గలసి ధనార్జన జేసెడివారు కాన నీపేరు సార్థకమై యుండవచ్చును.

ప్రజావినోదమునకై వీరు దేవాలయములందు నాట్యములు చేసెడివారు. రాజాస్థాన నర్తకీగాయినులు లంతఃపురస్త్రీలకు సైరంధ్రులుగను నృత్యగానవిద్యావిషయికబోధకులుగ నుండుటయు గలదు. ఇవిగాక వారికి దండులో స్థానముండెడిది. ఈ యాచారము పాశ్చాత్యులలోనైనను. (Epigraphica carnatica 8వ వాల్యూం–104వ పుట లోని) 1283 నాటి యొక శాసనమును బట్టి Rice గారిట్లు వ్రాసియున్నారు. "యుద్ధములలో వీరోచితపోరాటము సల్పిన వారిని వేశ్యలుపుష్పమాలాలంకృతులను జేయుచుండిరి. తద్గౌరవమునకై వీరులు సాహసమును ప్రదర్శించెడివారు"

విజయనగరపుదండులో వేలాది వీరకాంతలుండినట్లు న్యూనిజ్, బార్బోసా షరియాలు వ్రాసి యున్నారు.

"వీరుల నుత్సాహపరచుటకై రా జందమైన వేశ్యలను దండులోనుండ నియోగించెను. వారసంతృప్తిచే దండు వదలకుండ జేయుటకై వారికి చాల డబ్బు ముట్టజెప్పబడెడిది. వీరు యుద్ధము చేయరు కాని వీరిప్రియులు వీరోచితముగా పోరాడెడివారు. శత్రుసైన్యములనుండి కొందరు వీరులు వీరిచే నాకర్షింపబడి రాజదండులో చేరెడివారు. వీరు సంస్కారసంపదయుతులు........" బార్బోసా

Jehun nama విశ్వదర్పణములో భాతిబ్ జెలబీ యిట్లు వ్రాసియున్నారు. "విజయనగరపుదండులో చాలమంది భాగ్యవంతులైన వేశ్యలుండిరి."

sewell గారి A Forgatten Empire లో గూడ నిట్టి వివరములే గాన నగును.

రాజాజ్ఞ మీరిన వేశ్యలకు 1000 కొరడా దెబ్బలుగానీ 5000పణములజరిమానా గానీ విధింపవచ్చునని కౌటిల్యు డర్థశాస్త్రమున తెలిపియున్నాడు.

గౌరవముచే నైననేమి లేక చట్టబద్ధులైననేమి వేశ్యలుదండులో నుండి వీరుల నుత్సాహ పరచెడివారు. శారీరకసౌఖ్యప్రసాదము నను నృత్యగానవినోదప్రదర్శనమునను నిది జరిగెడిది. చతుర్విధ దేశ్యరాగముల క్రియాంగరాగము లొక కోవకు చెందినవి. ఇవి రతు లందు స్థాయీభావకపోషకములుగను యుద్ధాదిమహాకార్యోద్యోగులకు నింద్రియోత్సాహజనకములు. నాట, గౌళ, కేదారగౌళ, రీతిగౌళ నారాయణగౌళ, వరాళి, సారంగ, ఆహిరి శ్రీరాగాదు లివి. (దేవోత్సవములందు శ్రీ పాదతాంగులు(మోయువారు) పులకితాంగులై శ్రమ లెఖసేయకుండుటకై మేళగాళ్ళు ప్రత్యేకమైన బాణీలతో పలహారి, నాటరాగములు, రథోత్సవమున ఒడయు, ఎత్తిరికలను విని పింతురు. శక్తిజాతరలందు వీరంగమేళము లీకోవలోనివే.

ఇటుపై వారికట్నముల గూర్చి తెలుసుకొందము. రాజవాహన విజయము (2వ ఆశ్వా-72 ప) లో నిట్లున్నది.

చ. కిలకిల నవ్వి తానె పరికించుపురిన్ విటునట్టి వీధికా
తలచరదల్పవారవనితామణి పిల్చిననీటు వెట్టుచుం
బలుకదు తొంటిపైడి తన పాతికమాడకు మాటలాడరూ
కలుపదునైదు బిద్దురకు గట్టి వరాయును పట్టిదండునన్.

పైపద్యమునకు లఘుటీక యిట్లున్నది. "సాధారణముగా నగరులోతనకు తానై పిలుచు నాసికవు వేశ్యదండులో నీటు వెట్టుచు తనకు నిచ్చెడిడబ్బుతో పాతికవంతు మాటలాడుటకు ముందుగనే యివ్వవలె ననెను." నిఘంటుకారులు "పైడి" యనుపదమునకు (1) బంగారు (2) ధనము (3) నొకవిధమగు నాణెము (4) ఆభరణము (మూడవ

మఱియు నాల్గవయర్థములు సూ. రా. ని. లోనే కలవు) వను నాలుగర్థములు సూచించియున్నారు. ఇంకొక యర్థము వేశ్యకు నొక నాటినిదురకిచ్చెడి కట్నము." అట్టిచో పై పద్యభావ మిట్లుండును. "తనకుతానై నగరులో కిలకిల నవ్వుచు పలుకరించెడి నాసికపు గణిక (దండులో గిరాకిపెరుగగా) పిలచినపలుకదు. తన మునుపటిపైడి పాతికమాడను కాదనును. ఒకనిదురకు పదునైదురూకలు కట్టుమని కోరును.")

ఈ పైడి పదప్రయోగము వేశ్యాప్రసక్తిగల పలుచోట్లగలదు. క్షేత్రయ్యపదములలో

(1) మటుమాయలను జాలించు మాకియ్యవలసిన పైడి
అటుబెట్టిమాటాడు ఆదివరాహ ‖ అంద ‖ (1)

(2)............................
వేరొక లైవలెనే పొందుకు పైడి తెమ్మంటినా
.... (95)

(3) మువ్వగోపాలుని వెదకితోడ్తేరబోయిన కుంటెనగత్తె వెదకి వెదకి చెలితోననినపలుకు లివి.
పరగేవానిచేతి పైడిబట్టిన దానవా యింటి
గురుతు చెప్పవద్దా..................
....
యిచ్చినపైడిచేతికివచ్చినదే చాలునటవే
హెచ్చుకొద్దు లెరుగవలదా............... (116)

(4) తోటివారకాంతలతో చెలిహాస్యపడుట;
పదరివానిచే పైడి బట్టుకొనకుడీ...... (155)

(5) బాల్యక్రీడలందు మువ్వగోపాలుడు;
......విరిబోణిరో!రమ్మని విరులుజడనుజుట్టి
పరువమైననాటికి పైడి యిదేననుచు
.... (158)

కన్నెఱికమునకు సంచకరము నిచ్చుముచ్చటయిది. ఇట్లెశుక సప్తతి–కామసేనకథలో

చ. తనచెలికానితో పసిడి దార్చక యే నల కామసేనతో
నెనసితి నిన్న నంచువచియించిన నాతడు దాని యింటికిన్
జన మదినిల్ప జాలక ప్రసంగవశంబున సోమదత్తుడా
డిన వచనంబు లెల్ల బ్రకటించినచో వెలముద్దియుగ్రమై (3ఆ-28ప)

సోమదత్తుని యొద్దకుపైడివసూలుచేయుటకరగెను. అదేకథలో శివలింగము వెనుకజేరిన చిలుకపలికిన మోసపుమాటలు నమ్మి తనకు నిత్యయౌవనసంప్రాప్తమాయెననితలంచి వేశ్యాజరభియలంకరించుకొని

....
నింటికెవ్వారువచ్చిన నెనయుదనకు
నదిగో పైడీయవచ్చిరటంచు లేని
బింకమెక్కించుకొని........— (3ఆ-78ప)

వైజయంతీ విలాసకర్త యీపదమును రెండుచోట్లమాత్రమేవాడెను. వేశ్యాజీవితపు రోతలను దేవదేవి తెలిపెడిచో నిట్లున్నది.

ఉ. ఒక్కని బిల్వబంపి మఱియొక్కని చేత బసిండి బట్టివే
ఱొక్కని యింటికేగుచు మఱొక్కని నానకుచక్కినొక్కచో
బొక్కిలి దాల్చుకూడు భ్రిమబొందిఁ విటుల్ తెలియంగ లేరుగా
కెక్కడి సత్యమేడ వలపెక్కడినేయము వారకాంతకున్ (2ఆ-77ప)

రుక్మాంగద చరిత్రమునందు
....
కాంత కొక్క తెకిచ్చె కనకంబు క్రియనింట
భాసిల్లు సరిగోవపళ్ళెరంబు.
.... (4ఆ-104ప)

"కనకంబు క్రియ" ప్రయోగ మిచ్చటనే కన నగుచున్నది. తొలుత వారకాంతలకు స్వర్ణాభరణములనిచ్చెడి వాడుక యుండినది (చూడుము-బసవపురాణము-ముగ్ధసంగయకథ) క్రమముగా వారి శుల్కము నానాముల్లో వసూలగుచున్నను నిదిపైడి, పసిండి, కనకంబు ఇత్యాదినామంబుల వ్యవహరింపబడు చుండెడిది.

(సశేషము)

శృంగార నాయికలు

శ్రీ కాకరపర్తి కృష్ణశాస్త్రి.

(3) విరహోత్కంఠిత

'చిరయ త్యధికం కాంతే,విరహోత్కంఠితోన్మనాః'(ప్రతాపరుద్రీయే)

రాగము: ; తాళము : సంకీర్ణ జాతి

పల్లవి :—కనుగొనె డేల చెలి కాంతుడు వచ్చు నని
అనుమానము వలదు నను మఱచినాడే ॥ కను

అనుపల్లవి :—కనులకాటుక కఱగును నీరు నింపకు
మనె దేరికొఱకే తనుసింగారము
మనజాలనే మించినపిదప నిం కిట
వినరానిమాటను వినగలడే యతడు ॥ కను

చ. మగువలకే వలపు మఱిమఱి గల దమ్మ
మగజాతికి గలదె మాయయొక టె తప్ప
పగవారికిని నా పాటులు వల దమ్మ !
పగ మాత్రమే మిగిలె గద వలచుటచే
నగుబాట్ల పా లైతి నలుగురిలోపలను
తెగనోసెనె వలపు తీవియ మొదలంట
జగతిలో నాతిగ జనియింప జేయక
భగవంతు డేలనో పాణిగ నన్ జేసె ॥ కను

(4) విప్రలబ్ధ: "క్వచి త్సంకేత మావేద్య దయితే నాథ వంచితా
స్మరార్తా విప్రలబ్ధేతి కళావిద్భిః ప్రకీర్త్యతే॥ (ప్రతాపరుద్రీయే)

రాగము : పూరికళ్యాణి— తాళము : జంపె

పల్లవి :—నే డేల నాథ నీ-జాడ లిట గనుపడవు ॥ నే

అనుపల్లవి :—నీడలందున నెచట-నో డాగియున్నావొ
అడుదానిని యింత -యలయించి చంపెదే ॥ నే

చరణము :—కటికిచీకటి బెనగు- కారుమబ్బులలోని
కిటికీలలోనుండి -చిటుక వై చినలోన
మటుమాయ మాయెఅపు -చిటిది వ్యాసాయమున
నిటు నడచి వచ్చి చెడి-యే వచ్చినప్పటికి ॥ నేడే

నా శంకలు

శ్రీ 'సుధీః'

ఉ. ఉల్లమునందు నక్కటిక
 మూనుట మీకులమందు గంటి మం
చల్లన మేలమాడు నచ
 లాత్మజమాటకు లేఁతనవ్వు సం
ధిల్లఁ గిరీటిఁ బాశుపత
 దివ్యశరాఢ్యుని జేయు శాంబరీ
భిల్లుఁడు కృష్ణరాయల క
 భీష్టశుభప్రతిపాది గావుతన్.

"అర్జునునకు పాశుపతమహాస్త్రము గటాక్షించిన శాంబరీ భిల్లుఁడవు నీవు! సహజముష్కరములగు మీకిరాతకులీనుల హృదయముల గరుణారసము గలుగుట నేఁడు చూచితి"నని పర్వతరాజకుమారియగు భవాని శంకరుని జూచి మృదుగతిఁ బరిహాసవాక్యముఁ బలుకఁగా శంకరుఁడామె నెట్లును బరిహసింపఁజాలక చిఱునవ్వు నవ్వి మౌనముద్ర వహించినాఁడు. అట్టి శివుఁడు కృతిభర్తయగు శ్రీ కృష్ణదేవరాయల మనోభిలషితములకు శుభమును గలుగఁజేయుఁగాక యని పెద్దనార్యుడు శివుని సంప్రార్థించి యున్నాడు.

ఈ పద్యమందలి నాయల్పశంకలను వాకొందును. శంకరుఁడగు తనపతిని పైరీతిగ మేలమాడిన యామెత యచలాత్మజ. సహజకాఠిన్యమున కాకరమగు హిమవద్గిరిరాజునకు జన్మించినది. ఆమె వంశము మాత్రము నిరవధికకాఠిన్యము గలది కాదా? తన కులము నందలి కర్కశత డాగురించి తాత్కాలికముగ కిరాతవేషము మాత్రము ధరించి యర్జును నెదిరించి పాశుపతాస్త్రము నొసంగు దయాస్వభావుఁడు శివుఁడు సహజకఠిన స్వభావుఁ డగునా? ఈ దంపతులలో సహజకఠినులెవ్వరు? సహజదయాళువయ్యుఁ బార్థుని బరీక్షింపగోరి

కైరాతకవేషధారణ మొనరించిన పరమేశ్వరుఁడు నిజముగ కర్కశుఁడా!? పార్థియగు గిరిజ నైజసహజకర్కశత నాచ్ఛాదించి భర్తను పరిహసించుట పేలవముగ లేదా? శంభుఁ డమాయకుఁ డగుటచేత కాఁబోలు నవ్వి మౌనము బూనినాడు. ఆతఁడసాధ్యుఁడైనచో "నీవురాతి గుట్టలోఁ బుట్టిన కఠినాత్మవు. అదియుఁగాక నాతోఁబాటుగ కైరాతకీవేశధారిణివై నీవు మాత్రము నన్ననుసరింపలేదా!" యని యెదిరించి పరిహసింపలేదేమి? సర్వజ్ఞబిరుదధారియగు నప్పరమశివుఁ డింత యలౌకికతఁబ్రదర్శించినాడేమి? మౌనము వహించుట యర్ధాంగీకారము సూచింపదా! ప్రాపంచిక జ్ఞానము, జ్ఞప్తిశక్తి, సద్యస్సమాధానచాతురీప్రసక్తి లేని పశుపతి తన కృతిపతి కభీష్టశుభప్రతిపాది కాఁగలఁడా?

శివులకు సతీపతుల సరససంభాషణచమత్కృతులఁ దమ కావ్యములలో విచిత్రగతి రచించిన పూర్వకవివరు లెందఱో యున్నారు. అట్టి మహాశయుల వఱకెందులకు? ఆధునికుఁడగు కవిమూర్ధన్యుఁ డాంధ్రాస్థాన మహాకవి సార్వభౌమునకంకితమిడిన కాశీకాభ్యుదయ కావ్యమున కృత్యాది పద్యములలోని యొకదానిలో గల పార్వతీపరమేశ్వరుల సరసపరిహాససమన్వితము లగు నుత్తర ప్రత్యుత్తరములు దిలకింపుడు—

ఉ. ఉన్నత గోత్రసంభవత
యున్నదిలే కఠినత్వ మెట్లు పో
వు న్నిను వీడి? యంచు నభ
వుండు హసించుచుఁబల్క నార్యయున్
దిన్నగఁ దోఁచునే విషమ
దృష్టి కనం జెలిచెక్కు నొక్కుచున్
మన్నన సేయు శంకరుఁడు
మాకృతినాయకుఁ బ్రోచుఁగావుతన్.

* * *

శా. శ్రీవక్షోజకురంగనాభ మెదపైఁ
జెన్నొంద విశ్వంభరా
దేవిం దత్కమలాసమీపమునఁ బ్రీ
తి న్నిల్పినాఁడో యనం
గా వందారుసనందనాదినిజభ
క్తశ్రేణికిం దోఁచు రా
జీవాక్షుండు కృతార్థుఁ జేయు శుభదృ
ష్టిం గృష్ణరాయాధిపున్.

ఆంధ్రకవితాపితామహుని మధురకావ్యము నందలి యీ యాదిమపద్యమును గూడ కొంత పరిశీలించుట యుక్తము! "నిటాలమునఁదిలకమును, కపోలములందు మకరికాపత్రములను, కుచయుగళిపై లేపనము సింగారించుకొను పురాతనరాజపత్నుల నెఱిఁగిన పెద్దనామాత్యుఁ డీవిధముగ లిఖించినాడు.

నిజస్తనయుగిపై కస్తూరిలేపనము గావించుకొని రమాదేవి పతిని కౌఁగిలించుకొనునపుడు గాని, పతిచే నాశ్లేషింపఁబడినపుడుగాని విష్ణుదేవుని వక్షోభాగముననంటుకొని యది నల్లగ ప్రకాశించినది. ఆ కస్తూరికానీలముద్రాపార్శ్వముననే లక్ష్మీదేవి పతి యురముపై గూర్చుండినది. ఆసమయముననే హరిభక్తాగ్రేసరులగు సనకసనందన సనత్కుమారసనత్సుజాతులను బ్రహ్మర్షులు మొదలగువారు దేవతాపదార్చనార్థము వెల్లకిలశయనించి యున్న హరిపాదపంకజముల కడకు శయ్యాసమీపమునకు వచ్చి నిల్చినారు. వారికిని విష్ణువక్షస్థలికిని దూరమొక బారెడైన నుండదు. పదయుగికి నమస్కరింప వచ్చిన బ్రహ్మర్షుల మనోదృష్టులు తామువచ్చిన పనిపై బడకుండ ముందున కేగ బ్రాకి లక్ష్మీరమణీమణి దెసకు బ్రసరించినవి. ఆమెసరస నున్న మృగీమదముద్రపై గూడ వ్రాలినవి. ఆ బ్రహ్మర్షుల దృష్టిలోపమో

మనోవైకల్యమో కాని యాచేరువనున్న కస్తూరిముద్రకూడ నొక కామినిగా భ్రాంతిచే గన్పట్టినది. వా రానీల ముద్రను భూదేవిగ భావించి సవతుల పొత్తును గూర్చి యాశ్చర్యపడుచు నిలిచినారఁట!

విష్ణుదేవునివక్షముపై నింతకుమున్నే నల్లని మచ్చ యొకటి శాశ్వతముగనున్నదే! ఆ చెంతనే లక్ష్మీనివాసమే!! ఇంతకు మున్ను వారి కా భ్రాంతియేల కలుగలేదు? దీని నటుండనిండు. ఆ బ్రహ్మర్షుల ధ్యేయము భగవానుని పాదయుగ్మైకార్చనకార్యమేగదా! అవని ద్రోసిపుచ్చి యాసద్భక్తుల ధారాళ దృష్టి స్త్రీల దెసకేల పరుగిడినది? భ్రాంతి కవకాశ మొసంగని సామీప్యమువారికి భ్రాంతి కల్పించినదా! సనకసనందనాదులు భక్తులా? బ్రహ్మవేత్తలగు మహాజ్ఞానులా?

“మరీచ్యాదీన్ సృష్ట్వాప్రవృత్తి, ధర్మం గ్రాహయామాస-సనక సనందనాదీ నుత్పాద్యనివృత్తి ధర్మంగ్రాహయామాస”-అనుసిద్ధాంత మున్నదే!! సనకాదులఁ గేవల హరిభక్తులుగ కవిమణి లిఖించుటలో నర్థమేమి? దృష్టి లోపముగల కాంతల దెసఁగను నభిలాషగల భక్తులు గల రాజీవాక్షుఁడు కృష్ణరాయల దెస శుభదృష్టి బఱపి యభీష్టసిద్ధి నను గ్రహింపవలెనా !!

ఆంధ్ర కవితాపితామహబిరుదశోభితుఁడు, శ్రీకృష్ణదేవ రాయలవంటి మహారాజ కవిచే ననేకాపూర్వాద్భుతసన్మానములు వడసిన పండిత కవిమణి, భువనవిజయసభా భవనమున నిలిచి రాయల నలరించు నష్టదిగ్గజముల నగ్రగణ్యుఁడు నగు పెద్దనామాత్యుని కవన మింతలోప భూయిష్ఠమా!? ఔచిత్యమే తెలియని సామాన్యునివలె నీతఁడు మను చరిత్రమునందలి మొదటి పద్యములనే తడబడు నడకల వ్రాసి నాఁడేల? నేను బాహిరించిన సంశయములు సత్యములే యైన నింతకాలము స్వారోచిష మనుసంభవ మేల జీవించినది?

ఆంధ్రీకరణ సమస్యాపూరణములు

గతసంచికలో మే మొసఁగిన శ్లోకము, సమస్య :—

"మశకా మత్కుణా రాత్రౌ;
మక్షికా భిక్షుకా దివా;
పిపీలికాశ్చ భార్యా చ
దివారాత్రం ప్రబాధతే".

"కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
కాంతారసంవాసమున్"

---

1. విద్వాన్, గున్నేపల్లి అక్షయలింగకవి, కాకినాడ.

తే. గీ. నల్లులును దోమలును రేయి నలియఁజేయు
బిచ్చగాండ్రును నీఁగలు వేచుఁ బగలు
పవలు రేలును వేదనపాలుసేయు
భార్యయుఁ బిపీలికలును విశ్వమున నవుర !

మ. తలఁపన్ మున్నొనరించు కర్మఫలముల్
దప్పింప శక్యంబె ? వే
ల్పులకున్ సైత మసాధ్యమన్న నబలల్
పూఁబోండ్లకున్ సాధ్యమే !
కలిచేతన్ నిషధేంద్రుపత్ని గనియెం
గాంతారవాసమ్ము, చాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెం
గాంతారసంవాసమున్.

*

2. శ్రీ కావూరి పూర్ణచంద్రరావు, విజయవాడ-2.

తే. గీ. నిశల బాధించు మత్కుణమశకములు; ది
వముల మక్షికాభిక్షుకాబాధ చెలఁగు;
నాలిబాధయును బిపీలికాలిబాధ
తెలియనగుచుండుగాదె! రాత్రింబవళ్లు.

మ. పలికించె న్విధి తా బలీయమయి దు
ర్భామల్ ధరాజాతపై
నొలికించె న్విషధార మత్తుఁడగు నేఁ
డో యొక్కమాహాత్మ్యచేఁ!
దిలకింప న్విధి దప్పఁగోవశమె? తా
దేవుండెఱుంగాక! చాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
గాంతారసంవాసమున్.

*

3. భాషాప్రవీణ-రాష్ట్రభాషావిశారద, రేగిళ్ల సత్యనారాయణశర్మ,
పిఠాపురము.

తే. గీ. మశకమత్కుణంబులు రేసమయమునందు
భిక్షుమక్షికాళి పగటివేళయందు
కరగృహీతి పిపీలికల్ సరభసమున
పవలు రేలనక జనులబాధవెట్టు!!

మ. అల లంకేశ్వరునాలయాన చిరకా
లావాసముం జేసె నై
థిలి; ధర్మప్రభుఁడౌ రఘూద్వహుఁడు సా
ధ్వీరత్నమీసీత నా

బలుకన్ స్వీకృతిసేయ బాడియగునే!
వహ్వా! సెబాసన్నచాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
కాంతారసంవాసమున్.

*

4. శ్రీ "కార్తికేయ" ఆంధ్రసాహితీప్రచారసభ, పశ్చిమబెంగాల్.

తే. గీ. దోమయును, నల్లియును రేయి నేమొకుట్టు;
నీఁగయు బికారి విసిగింతు రేమొ పగలె;
చీమయును జేసికొన్నట్టి లేమయు నటు
గాక రేయింబవళ్లు చీకాకు గూర్చు!

మ. అల లంకేశ్వరు పంచనున్న శనభా
ర్యాం దెచ్చికొన్నట్టివెం
గలితేఁడగుమూఁగ రాముఁడను నేఁ
గానెన్నఁడున్; నిన్నిఁకన్
గులటా! రొయ్ల—నటంచుఁ బేలు నొకఁ డా
గుంబోతు మైమత్తు చాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
గాంతారసంవాసమున్.

*

5. శ్రీ ద్విభాష్యం వెంకటేశ్వరరావు, ఆనందాయుర్వేద నిలయము,
ఎలమంచిలి.

తే. గీ. మశకమత్కుణములు రేయి, మక్షికములు
భిక్షుకావళియున్ దివా వేళయందు
పవలు రేలు పిపీలికల్ భార్యయు పతి
బాధపెట్టుచునుందురి భూవలయమందు.

*

6. శ్రీ శిష్ట్లా వేంకటశాస్త్రి, B. A; B. Ts; సికింద్రాబాద్.

తే.గీ. మాపు బాధించు మశకము ల్మత్కుణములు;
పవలు మక్షికభిక్షుకప్రతతి నొంచు;
నప్పుడిప్పుడు ననక భార్యయునుఁ జీమ
లహము రాత్రమ్ముఁబీడించు నతిశయించి.

మ. కులికెన్ రక్కసికొంపలో విడిచి సం
కోచమ్ముఁ గొన్నాళ్లు; ని
వ్వాలలో దూఁకెఁ బతివ్రతాతిలక మ
బ్బో! యగ్గి చల్లారె; రా
జులకున్ రాజఁట! రాముఁడంట!! పతితన్
శోధించినాఁ డన్న చోఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
కాంతారసంవాసమున్.

*

7. శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునకవి, పామఱ్ఱు.

తే. గీ. రేయి నల్లులు దోమలు చేయు బాధ
పగలు యాచకుఁ డీఁగలు బాధ గూర్చుఁ
జెట్టవట్టిన కాంతయుఁ జీమలెల్లఁ
బగలు రేయును మిక్కిలి బాధ వెట్టు.

మ. అలుకంబూని కరమ్ము రాఘవుఁడు లం
కాధీశునిన్ రావణున్
బలుబాణంబులు వేసి చంపి మొలమిన్
బద్మాక్షికిన్ సీతకున్

గలుగం జేయుచు రాజ్యమేలుచును దాఁ
గా రాముతో నుండఁ జాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
కాంతారసంవాసమున్.

*

8. శ్రీ కత్తా శ్రీమూర్తికవి, ఆంధ్రసాహితీప్రచారసభ, పశ్చిమ బెంగాల్.

తే. గీ. మలసి నల్లులు దోమలు మాపులందె
రేపులనె జోగు లీఁగలు వేపుఁగాని
యాలుఁ జలిచీమచాలును జాలిమాలి
రేపుమాపును నొప్పించి యేపుమాపు.

మ. అలరుం దొట్టిల ముద్దుగాఁ బెరిగి ధై
ర్యస్థైర్యగాంభీర్యసం
కలితున్ రాఘవుఁ జెట్టపట్టి గిరిదు
ర్గప్రాంతముల్ మెట్టి తె
క్కలి రాకాసి శపించి పావకపరీ
క్షన్మించియున్ చీకుచాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్
గాంతారసంవాసమున్.

* * *

మహాకవి కాళిదాసుని వ్యాకరణోపమలు

శ్రీ అయ్యగారి నరసింహమూర్తి.

సౌందర్యసమారాధనము, సూక్ష్మపరిశీలనాకౌతూహలము గల కాళిదాసు కాలగతిచే ప్రకృతితత్త్వములోఁ గలుగు పరిణామములను సమ్యగ్దృష్టితోఁ బరిశీలించి యాకళింపుచేసికొని తద్దర్శనముచేఁ గలిగిన యానందమునకుఁ బరవశుఁడై శాస్త్రాధ్యయనమువలనఁ గలిగిన ప్రతిభావ్యుత్పత్తులతో 'ఋతుసంహారము' పేర తన రచనకు శ్రీకారమును జుట్టినాఁడు.

సమ్యగ్దృష్టి, సమగ్రపాండిత్యము, రచనాపాటవము భావనా చణత్వము, సంపాదించినపిమ్మట రఘువంశమహాకావ్యరచన కుపక్రమించుటకు ముందు బహువారములు 'ఆదికవి' వాల్మీకి రామాయణమును జదివి యాకళింపుచేసికొనినవాడగుటచే నాతనికి ధర్మమార్గమును, వినయసౌశీల్యాదిసుగుణసంపదలు పట్టుబడినవి. కనుకనే యాతఁడు రఘువంశమున 'మన్దః కవియశః ప్రార్థీ గమిష్యామ్యుపహాస్యతామ్ । ప్రాంశులభ్యే ఫలే లోభా దుద్బాహు రివ వామనః' అని తన వినయగుణమును బ్రదర్శించినాఁడు. రిక్తస్సర్వో భవతి హి లఘుః పూర్ణతా గౌరవాయ' యనుసూక్తికనుగుణముగాఁ బ్రకృతి తత్త్వమును శాస్త్రములను నధ్యయనము చేసి పూర్ణత్వమును సంపాదించుటయే గాక తన కళయందు గౌరవము, తన విద్యయందు దృఢశక్తి, యాత్మవిశ్వాసము గలిగినవాడగుటచే భంగ్యంతరమున తన కవితను గూర్చి తెలిపినాఁడు, తదనంతరము తనకు సాహిత్యక్షేత్రమునఁ గలుగు స్థానమును రఘువంశమహాకావ్యముననే వివరించినాడని పఞ్చదశ, సప్తదశసర్గలయందుఁగల యీక్రిందిశ్లోకములనుబట్టి మన మూహించుకొనవచ్చును.

"సాఙ్గంచ వేద మధ్యాప్యకించి దుత్క్రాన్తశైశవౌ । స్వకృతిం గాపయామాస కవిప్రథమ పద్ధతిమ్" (రఘు 15-33). నేటికిని సంస్కృతము జదువువారికి ప్రథమమున రఘువంశమునే గదా యారంభించుట.

"ప్రవృద్ధౌ హీయతే చన్ద్రః సముద్రోఽపి తథావిధః। సతు తత్సమ వృద్ధిశ్చ నచాభూత్తా వివక్షయో" (రఘు 17-71). ఈవాక్యము లాతని జ్ఞానసంపత్తికి నాత్మవిశ్వాసమునకు, కాంతదర్శిత్వమునకు నిదర్శనములు. కావుననే గాళిదాసుని గూర్చి "కాళిదాస గిరాం సారం కాళిదాస స్సరస్వతీ। చతుర్ముఖోఽథవా సాక్షా ద్విదు ర్నాన్యేతు మాదృశాః" అనుసూక్తి మల్లినాథుని ముఖపద్మమునుండి బహిర్గతమైనది.

మాళవిక రచనాకాలమునకు కాళిదాసునకుఁ బండితసంఘమున మంచి గౌరవప్రతిష్ఠలు లభించియుండుటయే గాక తన గ్రంథములకు మంచి ప్రచారముగూడ జరిగియుండును. ఆకారణముననే మాళవిక నాటకప్రస్తావనలో సూత్రధారుఁడు "అభిహితోఽస్మి విద్వత్పరిషదా కాళిదాసగ్రథితవస్తు మాళవికాగ్నిమిత్రనామనాటక మస్మిన్ వసంతోత్సవే ప్రయోక్తవ్య మితి" యని పలుకగనే పారిపార్శ్వకుఁడు "మాతావత్ ప్రథితయశసాం భాసకవిపుత్రసౌమిల్లకాదీనామ్ ప్రబన్ధానతిక్రమ్య వర్తమానకవేః కాళిదాసస్య క్రియాయాంమాంద్రష్టుం కథంపరిషదో బహుమానః" అనిచెప్పగా దానికి సూత్రధారుఁడు "పురాణమిత్యేవ న సాధుసర్వం నచాపి కావ్యం నవ మిత్యవద్యమ్। సన్తః పరీక్ష్యాన్య తర ద్భజన్తే మూఢః పరప్రత్యయనేయబుద్ధిః" అని సమాధానము చెప్పినాఁడు. తదనంతరరచనమైన 'విక్రమోర్వశీయము'న సూత్రధారుఁడు "మారిష, బహుశస్తు పరిషదా పూర్వేషాం కవీనాం దృష్టాః ప్రయోగబన్ధాః సోఽహమద్య విక్రమోర్వశీయం నామనాటకమపూర్వం ప్రయోక్ష్యే। తదుచ్యతాం పాత్రవర్గః స్వేషు స్వేషు పాఠేష్వసం మూఢై ర్భవితవ్యమితి" దానికి పారిపార్శ్వకుఁడు "యథాజ్ఞాపయతి భావః" అని మిన్నకుండును.

కాళిదాసునకు తననాటకములు పలుచోట్ల ప్రదర్శింపబడినంత మాత్రమునఁ దృప్తి కలుగలేదు. విద్వజ్జనప్రశంసలనంది సాటివారిలో నద్వితీయుఁడను కీర్తి నందవలెననెడి యాకాంక్ష యభిజ్ఞానరచనా

కాలమునాటికే మిక్కుటమైయుండియుండును. ఆకారణముననే తన్నాటకప్రస్తావనలో సూత్రధారునిచే "ఆపరితోషా ద్విదుషాం నసాధుమన్యే ప్రయోగవిజ్ఞానమ్ బలవదపి శిక్షితానాం ఆత్మన్య ప్రత్యయంచేతః"(నానేర్పును బండితులు కని మెచ్చునంత వఱకు నేను సరియగునని నమ్మజాలను. లోకములో నెంతప్రయత్నములో నేర్చిన వానికైనను దనయభిప్రాయముంబట్టియే తననేర్పునమ్మకముకుదుఱదు) అంతటి పట్టుదల, దానికనువగు పరిశ్రమతో రచించిన రచన యగుటచే నా "యభిజ్ఞానశాకున్తలము" నాటకరాజమున కభిజ్ఞానమై ప్రపంచసాహితీవేత్తలచే బహుధా ప్రశంసింపఁబడుచున్నది.

'తదిదం చిత్రం విశ్వం బ్రహ్మజ్ఞానా దివోపమాజ్ఞానాత్ జ్ఞాతం భవతీత్యాదా నిరూప్యతే నిఖిలభేదసహితా సా' (అర్థచిత్రమీమాంస-అప్పయదీక్షితులు).

కాళిదాసట్టి బ్రహ్మజ్ఞానమును బ్రకృతిశాస్త్రాధ్యయనముల మూలమున సాధించి రచనకుపక్రమించినవాడగుటచేఁదన రచనయందు సఫలీకృతుడై 'ఉపమా కాళిదాసస్య'యని 'దీపశిఖా'యని బిరుదముల నంది నాటినుండి నేటివఱకు స్వదేశమునందే గాక ఖండాంతరముల యందును విశిష్టమైనఖ్యాతి నార్జించి సాహిత్యలోకమున 'దీపశిఖ'గా విరాజిల్లుచున్నాఁడు.

బ్రహ్మజ్ఞానముగాఁబరిణతిచెందు జ్ఞాన ముపమాలంకారతత్త్వ జ్ఞానము చేతనేయుదయించును. ఈ యుపమాజ్ఞానము విభిన్నమైన రెండు వస్తువులలోఁబోలికనుజూడఁ గలిగిన వ్యక్తి కలవడును. బ్రహ్మజ్ఞానముగాఁబరిణతిచెందు నుపమాతత్త్వజ్ఞానమును సంపాదించుటలో కాళిదాసు పారమునుముట్టినవాడగుటచేఁ దనరచనలలోఁ బెక్కు శాస్త్రవిషయముల నుపమానములుగా గ్రహించినట్లే వ్యాకరణాంశములను గూడ నుపమానములుగా నైదాఱు స్థానములలో గ్రహించినాఁడు. దానికిఁగారణము కాళిదాసే యీశ్లోకమున భంగ్యంతరముగా సూచన చేసినాడని చెప్పనొప్పును.

"చక్షుష్మత్తాతు శాస్త్రేణ సూక్ష్మకార్యార్థ దర్శినా" (రఘు. 4-13) అతఁడు చర్మచక్షువులకు గోచరింపని దురూహకార్య మార్గములను శాస్త్రముచే నెఱుంగుచుండెను. కాని యాతని యందు చర్మచక్షువుకన్న శాస్త్రమే ప్రధాన చక్షువుగా నుండెను.

ఈతని వ్యాకరణోపమలను జక్కగాఁబరిశీలించినచో నాతని బుద్ధినైగనిగ్యము, వ్యాకరణశాస్త్రపారంగతత్వము, తెలిసిన విషయమును కేవలపాండిత్యప్రకటనార్థముగాక సందర్భోచితముగఁ బ్రదర్శించు వివేచనాదక్షత తెలియఁగలదు. ఈ యుపమానము లాతని యక్షరజ్ఞానమునకు నిదర్శనములు. 'శ్రుతస్య యాయాదయమన్త మర్భకస్తథా పరేషాం యుధి చేతి పార్థివః । అవేక్ష్యధాతోర్గమనార్థ మర్థ విచ్చకార నామ్నా రఘు మాత్మసంభవమ్' (రఘు 3-21) శబ్దార్థ జ్ఞానము గలవాడయిన యాదిలీపమహారాజు నాకుమారుఁడు (రఘువు) శాస్త్రములయంతమున కేగుట కనఁగా సకలశాస్త్రపారగుఁడగుటకు, నట్లే యుద్ధమందు శత్రువులయంతమం దేగుటకు - ననగా శత్రువులనెల్ల రూపుమాపుటకును సమర్థుఁడగును. అను హేతువు వలన 'ఏగుట' అను నర్థము గలదైన 'లఘి' ధాతువునుండి నిష్పన్న మయిన రఘుశబ్దము నాకుమారునకుఁ బేరుగా నిడెను.

ధాతువనఁగా వ్యాపారమును దెలుపునది. 'అఘి, వఘి, లఘి' యను నీధాతువులు గత్యర్థకములు (గమనార్థకములు). ఈధాతువులలో 'లఘి' యను ధాతువునకు గమనరూపమైన యర్థమును జూచి 'లఘి' యను ధాతువునకంతె 'కు' (క్+ఉ) అను ప్రత్యయమును జేయగా (లన్ ఘ్+ఉలఙ్ఘిబంహ్యోర్నలోపశ్చేత్యు ప్రత్యయమే) తరువాతనున్న లకారమునకు రేఫమురాగా 'రఘు' అని యగును. రఘుశబ్దమునకు వేగమనియర్థము. రఘువనఁగా నన్నిటను బారముజూచినవాడని యర్థము. ఈయర్థమును గ్రహించియే దిలీపుడు తన కుమారునకు రఘు

వ'ని నామకరణము చేసినాఁడు. 'ధాతు'వనుసది వ్యాకరణ పారిభాషికము.రఘు శబ్దరూపనిష్పాదనము శబ్దార్థము నిందు దెలిపినాఁడు.

2.తానరాధిపసంతా నృపజాత్మజైస్తైశ్చ తాభిరగమన్కృతార్థతామ్।
సోఽభవద్వరవధూసమాగమః ప్రత్యయప్రకృతియోగసన్నిభః(రఘు. 11-56).

సందర్భము:—సీతారామాదిస్వయంవరములు. (అవరులలో వధువులు నావధువులలో వరులు కృతార్థతను జెందినారు. ఆ సమాగమము ప్రకృతి-ప్రత్యయ సమాగమమువలె సార్థకమైనది.) ఇందు ప్రకృతి-ప్రత్యయము-ననునవి వ్యాకరణపారిభాషికములు. ప్రక్రియతే ఆదా క్రియతే ఇతి ప్రకృతిః। ప్రతీయతేఽర్థోఽనేనేతి ప్రత్యయః (లేక) స్వాతంత్ర్యేణ ప్రయోగానార్హత్వాత్ ప్రత్యయః (నాగేశభట్టు)న కేవలా ప్రకృతిర్ప్రయోక్తవ్యానాపి ప్రత్యయః-ఇతి శాస్త్రమ్.

లోకమున కేవలప్రకృతికిఁగాని కేవలప్రత్యయమునకు గాని ప్రయోగములేదు. ప్రకృతిప్రత్యయసముదాయమునకే లోకమునఁ బ్రయోగముగలదు. ఉదా:-'రామ' యనునది ప్రకృతి (ప్రాతిపదిక). సు అనునది ప్రత్యయము. కేవలప్రకృతియైన 'రామ' యను దానికి లోకమున ప్రయోగములేదు. కేవల ప్రత్యయమగు 'సు' అనుదానికి లోకమున ప్రయోగములేదు. ఈరెండును కలిసిన రామ+సు-రామః అనుదానికే లోకమున వ్యవహారము గలదు.

రామ+స్-రామ+ర్-రామ+ః-రామః;లోకమునఁబ్రయోగింపఁబడునది రామః-ఇదియే సుబన్తము. ఇట్టి సుబన్తమునకే పదమని పేరు. సీతారామాదివివాహములు ప్రకృతిప్రత్యయసంయోగము వలె నున్నదని కాళిదాసు చెప్పినాఁడు. లోకమున ప్రకృతిప్రత్యయములు సంయోగరహితమైనపు డర్థ (నంతము)ము, ప్రయోజనము లేకుండినట్లే లోకములో స్త్రీ పురుషులు విడివిడిగానుండిన ప్రయోజనము లేదు. సృష్టిప్రయోజకత్వము స్త్రీ పురుషుల సమాగమమే.

సృష్టికి హేతుభూతము స్త్రీ పురుషసమాగమము. శబ్దసృష్టికి మూలభూతము ప్రకృతిప్రత్యయ యోగము. ఈ ద్వంద్వములచేతనే లోకవ్యాపారము జరుగుచున్నది. వధూవరుల యోగమును వివరించుటకు లోకమున దీనికి సాటిరాఁదగిన యుపమానము వేఱొకటి యుండదు. ఈయుపమానమొక్క వ్యాకరణశాస్త్రమునందక్క వేఱొక చోట దుర్లభముగనుక నీతఁడు వ్యాకరణాంశములనుపమానములుగా గ్రహించినాడు.

మొదటి యుపమాన మాతని శబ్దవ్యుత్పత్తికి నిదర్శనము కాగా నీ యుపమానము సందర్భోచితపాండిత్యప్రదర్శనమునకు నిదర్శనము. ఆతని యితరోపమానము లొకయెత్తు. ఇదియొకటి యొకయెత్తు. మల్లినాథులు నుడివినట్లు 'సాక్షాత్ చతుర్ముఖుఁడే'యగు నీ కాళిదాసు. కాకున్న నిట్టి ఘటనలు దుర్లభములుగదా !

3. "సహత్వా వాలినం వీరస్తత్పదే చిరకాంక్షితే। ధాతోః స్థాన ఇవాదేశం సుగ్రీవం సన్న్యవేశయత్ (రఘు 12-58; వాలిని చంపి చిరకాలముగాఁ గోరుచున్న వానరరాజ్యపదవిపై సుగ్రీవుని నభిషిక్తుని చేసినాఁడు. శ్రీరాముఁడు ధాతుస్థానములో నాదేశమును వలె రాజ్యములో నాతని ప్రతిష్ఠించినాఁడు)

ఇట ధాతువు; ఆదేశము ననునవి వ్యాకరణసాంకేతికములు. ఆదేశమనఁగా నొకానొక శబ్దముయొక్క స్థానమున విధింపబడు మఱియొక శబ్దము. ఉదా...'అస్'అనునది ధాతువు. ఈధాతువు 'లట్టు'లో (వర్తమానకాలములో) 'అస్తి'యగును. 'లిట్టు'లో (పరోక్షభూతము) 'బభూవ' యని యగును. ఇచట 'అస్' అను ధాతువు స్థానమున "అస్తేర్భూః"అనుసూత్రముచే 'భూ'అనునది యాదేశముగావచ్చును. 'లిట్టు'నకు చేయవలసిన ప్రక్రియచేయఁగా 'బభూవ' యని యగును. ఆరీతిగనే శ్రీరాముఁడు వాలి స్థానములోసుగ్రీవు నుంచెను. అనఁగా వాలిని లేకుండఁగఁజేసి (చంపి) వాని స్థానమున సుగ్రీవుని స్థాపించెనని

యగ్గము. ఎట్లన 'అస్' ధాతువు స్థానమున 'భూ' అనునది యాదేశ
ముగ ప్రాప్తించిన విధమున.

4. యః కశ్చన రఘూణాం హి పరమేకః పరంతపః। అపవాద ఇవో
త్సర్గం వ్యావర్తయితు మీశ్వరః (రఘు 15-7)సందర్భము:-యమునా
తీరవాసులైన మునుల యాగక్రియలకు లవణాసురుఁడనురాక్షసుఁడు
విఘాతము కల్పించుచుండ వారు రాముని శరణువేడగా వారికి రాము
డభయమిచ్చి లవణాసురసంహారమునకై రాముడు శత్రుఘ్ను నాదే
శించుట.

అపవాదము : ఉత్సర్గ-ఇవి వ్యాకరణపారిభాషికములు.

ఉత్సర్గయనఁగా సామాన్య శాస్త్రము. దానికి బాధక
మపవాదము. బహువ్యాపకము సామాన్యమని, యల్పవ్యాపకము
విశేషమని చెప్పఁబడుచున్నది. భూయోదర్శనముత్సర్గో బాధస్తస్యై
కదేశగః। అపవాదః సవిజ్ఞేయో మృగ్యోవ్యాకరణాదిషు-హేమాద్రి.
సామాన్యశాస్త్రమును విశేషవిధి బాధించునట్లుగనే శత్రువులను
దహింపఁజేయుట రాజులందఱి సామాన్య లక్షణమైనను 'పరమేకః పరం
తపః' అనుమాటలచేఁ దానొక్కఁడే శత్రువులను దహింపఁజేయఁగల
శక్తిసామర్థ్యములు గలవాడని తెల్లమగుచున్నది. ఉదా:-(శ్రీ+ఈశః
అని యుండగా నిట 'ఇకోయణచి' అనుసూత్రముచేత నికారమున
కచ్చు పరముగా నున్నపుడు 'య'(యణ్)కారమాదేశముగ వచ్చునను
శాస్త్రముచేత యణాదేశము ప్రాప్తించుచున్నది. ఇది సామాన్య
శాస్త్రము లేక ఉత్సర్గ. అకస్సవర్ణేదీర్ఘః అనుసూత్రముచేత అక్కు
(6, ఇ ఉ ఋ ఌ)నకు సవర్ణమైన యచ్చు పరముగానున్నపుడు దీర్ఘమే
కాదేశముగా వచ్చునను శాస్త్రము చేత (శ్రీ+ఈశః అను
చోట సవర్ణదీర్ఘము ప్రాప్తించుచున్నది. కాని యిట ఇకారమునకు
శే యచ్చుపరముగానున్నను యణాదేశమువచ్చుటకు బాధలేదు.
కాని సవర్ణదీర్ఘము రావలెనన్న ఇకారరూపాచ్చునకు సమానరూప

మగు నికారము పరముగనున్నపుడే వచ్చును. అందుచే బహువ్యాప కత్వము కలిగిన ఇకోయణచియను శాస్త్రమును అల్పవ్యాపకమగు అకస్సవర్ణేదీర్ఘః అను శాస్త్రము బాధించును. ఇది యపవాదము.

కుమారసంభవద్వితీయసర్గలో నిదే యుపమానమును వాడినాఁడు.

లబ్ధప్రతిష్ఠాః ప్రథమం యసూాయం కిం బలవత్తరైః అపవాదైరి వోత్సర్గాః కృతవ్యావృత్తయః పరైః (2-27; సామాన్యశాస్త్రవిధి విశేషశాస్త్రవిధిచేతను సంకోచము చేయఁబడినట్లు శత్రులచే పరాభ వము నొందితిరా?) దీనికి వ్యాఖ్యానమునందీయఁబడిన మఱియొక యుదాహరణము. గోవును చంపకుము. సామాన్యశాస్త్రము గోయా గమున గోవునుచంపుము. విశేషశాస్త్రము ఇపుడు యజ్ఞస్థలములలో సామాన్యశాస్త్రము సంకోచింపఁబడెను.

౬. రామాదేశాదనుగతా సేనా తస్యార్థసిద్ధయే। పశ్చాదధ్య యనార్థస్య ధాతోరధిరివాభవత్ (రఘు 15-9) రాముని యాదేశము తోనాతని వెనుక సేనావారమును గదలినది. 'అధి' యను నుపసర్గ లేకున్నను ధాతువున కర్థసిద్ధి సిద్ధమే. ఆవిధముగనే యీసేన లేకున్నను ఆయన పని సాధింపఁగలఁడు. అయినను ఔపచారికముగ సేనకూడ కదలినది. సందర్భము వెనుకటిదే.

ఇఙికావధ్యుపసర్గం నవ్యభిచరితః ఇతిన్యాయః. ఉపసర్గను విడచి ధాతువుండవచ్చును. కాని యుపసర్గ ధాతువును విడిచియుండదు. ధాతువేయర్థమునుగలిగి యుండగా నుపసర్గ యాధాతువుయొక్క అర్థ మునే ద్యోతనచేయును. ఉపసర్గ ధాతువుయొక్క యర్థమునెన్నడును చెప్పదు.

ఉపసర్గలేకుండగనే ఇఙ్-అధ్యయనే అగు ధాతువునకర్థము గలదు. అయినను స్వయముగా నర్థసాధకమగు ఇఙ్-అధ్యయనే యను ధాతువునకు 'అధి' యను నుపసర్గ సమీపము నందుండి యుపకరించు చున్నది. ఆరీతిగనే శత్రుఘ్నుడొక్కఁడే యుద్ధమొనర్చి శత్రువులను

నాశనముచేయఁగల శక్తిమంతుఁడై నను నాతనివెనుక సేన యలంకార ప్రాయముగ వెడలినదని చెప్పినాఁడు. ధాతువేతీరున స్వయంబోధకము శక్తిమంతము నగునో యట్టి యుద్ధవిశారదుఁ డీ శత్రుఘ్నుఁడు.

ఈ తీరున కాళిదాసు డనర్ఘము, అనర్గళము, ననవద్యము నన శ్వరమునగు తన వ్యాకరణపాండిత్యము నుచితరీతిని తన గ్రంథములందు ప్రదర్శించి తన యక్షరజ్ఞానమును సార్థకము చేసికొనినాఁడు.

రామలింగేశ్వర శతకము

కీ. శే. వడ్డిపర్తి నాగరాజు

శా. శ్రీ విహారంగ నగేంద్రకన్య గొలువన్ చిత్తంబు రంజిల్ల నా
వామాంగి న్మదిమెచ్చి భక్తజనము ల్వాంఛించుభోగంబులన్
వేమారున్ దగ నిచ్చి ప్రోచుచు మహావిస్ఫూర్తి రామేశ్వర
గ్రామావాసగరిష్ఠత న్వెలసితౌరా! రామలింగేశ్వరా! 1

శా. శ్రీ రంజిల్లఁ బయోధిఁ గట్టి సురవైరి న్దుంచి సీతాన్వితుం
డై రాగా నిట యేల బంపయును తుల్యాఖ్యానదీశ్రేష్ఠమున్
జేరంగూడి పయోధి జొచ్చిన మహాక్షేత్రం బటం చిచ్చటన్
శ్రీరాముండు ప్రతిష్ఠ జేసెను మిమున్ శ్రీరామలింగేశ్వరా! 2

మ. శతమన్యుప్రముఖామరుల్ నిను మదిం జర్చించి పూజించి యా
నతులై వేడిన వారివారి మనముల్ నందించు నట్లా మహో
న్నతసామ్రాజ్యపదంబు లిచ్చితివి శ్రీనాగేంద్రసత్కుండలా!
శ్రితసంరక్షణ! పాపశిక్షణచణా! శ్రీరామలింగేశ్వరా! 3

మ. నిగమంబుల్ నుతిసేయ నేరవు భవానీనాథ! నీసత్కథల్
దగఁ గీర్తింపఁగ మర్త్యు లెంతటిఘనుల్? దైత్యారిసంరక్షణా!
ఖగవాహాంబక! దేవదేవ! యభవా! కంసారిసంపూజితా!
జగదారాధ్య! కృపాసముద్ర! నిఖిలేశా! రామలింగేశ్వరా! 4

మ. కనకాహార్యము చాపమున్ కడు జగత్కల్యాణుఁడౌ విష్ణుఁడున్
ఘనబాణంబును నారి వాసుకియుఁ గాఁగ న్భూమి తేరౌచునుం
దనరన్ చక్రయుగంబు నబ్జహితునిం దారాధిపుం జేసి నీ
ఘనశక్తిం బురముల్ జయించితివి పీఁకన్ రామలింగేశ్వరా! 5

మ. కరుణాసాగర! శంకరా! భవహరా! కామారి! విశ్వంభరా!
గిరిచాపా! హరిరోప! పాహి యని నీ స్కీర్తించు సద్భక్తులన్
పరమాహ్లాదముతోడ జూచి సరగన్ బాలించి రక్షించు నీ
నెరకారుణ్యరసంబు నెన్నఁ దరమా నే రామలింగేశ్వరా! 6

మ. మదలిప్తుం డగు నగ్గజాసురుఁడు దుర్మాదంబుతో దేవతా
సదనంబుల్ దెగఁజూచి దేవతల సత్సౌఖ్యంబులన్వాపి శు
క్రపదుఁడై యుండఁగ దేవతల్ శరణు సాంబా! పాహియన్నంతవా
రి దయన్ దేలిచి దైత్యు ద్రుంచితివిగా శ్రీరామలింగేశ్వరా! 7

మ. కరుణాసాగర! శర్వ! సాంబ! యని యక్కాంతేయుఁడౌ నర్జునుం
డురు మోదంబున నిన్నుఁగూర్చి తప మత్యుగ్రంబుగాఁ జేయ స
త్వరతం బాశుపతాస్త్ర మిచ్చి యతనిన్ ధన్యాత్ముగాఁ జేసి నీ
చిరకారుణ్యపయోధిఁ దేల్చితివిగా శ్రీరామలింగేశ్వరా! 8

శా. కాలం దన్నితి సోము నంచును మహాకారుణ్యమే పారఁగా
లీలన్ వానిని నెత్తిఁ బెట్టుకొను నీ లీలల్ కృపాలోలతల్
వీలోకించి పొగడ్త సేయఁదరమా విశ్వేశ్వరా! దేవ! యో
శ్రీలోలార్చితపాదపద్మయుగళా! శ్రీరామలింగేశ్వరా! 9

మ. భవ! లోకేశ్వర! భక్తరక్షణకళాప్రావీణ్య! విశ్వంభరా!
స్తవనీయాఖిల దేవపాపలతికాదాత్రా! కృపాసాగరా!
భవబంధోగ్రవనీకుఠార చరితా! భక్తార్తిసంహారకా!
శివ! నారాయణమిత్ర! ప్రోవఁగదవే శ్రీరామలింగేశ్వరా! 10

మ. శతమన్యుండు భవత్ప్రసాదమునఁ దా సైన్యాధిపుం గోరి యా
శతపత్రాంబకు జీరి నీపయినిఁ జంచస్ఫూర్తిఁ బుష్పాస్త్రముల్
శతముల్గా నిగుడించి మోహపఱుపన్ సారించి దృక్కీలి ని
ర్జితుఁగాఁ జేసి యనంగుఁ జేసితివిగా శ్రీరామలింగేశ్వరా! 11

శా. చేతోవీథిని నిన్ను నిల్పుకొని నిశ్చింతాత్ముఁడై భక్తితో
చేతోజాతహరా! హరా! భవహరా! శ్రీసాంబ! సర్వేశ! నీ
గీతంబుల్ పఠియించునట్టి జనుల న్గీర్తించు సద్భక్తసం
ఘాతంబు న్నుతియింప ముక్తి గలుగుంగా రామలింగేశ్వరా! 12

మ. శరణన్నం గరుణించువేల్పు వని యో చంద్రార్ధచూడామణీ
పరమాహ్లాదముతోడ భక్తులు నినుం బ్రార్థింపఁగా వారికిన్
బరమాశ్చర్యముగా నిహంబు బరమున్ బ్రాపించు నీ దివ్యసు
స్థిరపాదాబ్జయుగంబు గోరెద నెదన్ శ్రీరామలింగేశ్వరా! 13

మ. కమలాభర్త భవత్ప్రసాదమును నిక్కం బాత్మలోఁ గోరి దాఁ
గమలంబుల్ పదినూర్లు దేఁ గొదువ కాగా నొండు నీక్షించి యా
విమలుం డాత్మను రోసి నేత్ర మెలమి న్వేదీసి పూజించినన్
కమలాక్షుం డను నామమిచ్చితివి వేడ్కన్ రామలింగేశ్వరా! 14

శా. బాణుం డెంతటి పుణ్యుఁడో మిము మదిం బ్రార్థింపఁగా వాని న
క్షీణోదారబలుండు గాఁగఁ గృప రక్షింపంగ నూహించి యా
క్షోణిం దద్గృహవాటి నిల్చితట యక్షుద్రప్రతాపంబునన్
శ్రేణుల్గట్టి సురల్నుతింపఁగ మిమున్ శ్రీరామలింగేశ్వరా! 15

శా. లంకాధీశుఁడు రావణుండు దగ నీ లావుం బరీక్షింపఁగా
శంకంబొందక వెండికొండఁ గదలించంబూని జృంభింపమీ
యంకస్థాయినియైన గౌరి యిది యే మన్నంతలో స్రుక్కి ని
శ్శంకం గావు మటన్నఁ గాచితి వుమేశా! రామలింగేశ్వరా! 16

శా. కాంతారత్నము సర్వమంగళ జగత్కల్యాణి యీ దుర్గ నీ
చెంతంజేరి భజించు భక్తులకు నిస్సీమస్థితిం గోరికల్
సంతోషంబున నిచ్చుచుండఁ గుమతుల్ స్వామీ!శివా! యంచునీ
చెంతం జేరఁగలే రదేమొకో సదా శ్రీరామలింగేశ్వరా! 17

మ. సతియా నీ సతి సర్వమంగళ జగత్సన్మాన్యచారిత్ర సం
తతమున్ భక్తుల బ్రోచు గంగ దన సత్తామాత్రచే దాసులం
జితపాపాత్ములఁ జేయు విఘ్నపతి నిర్జించున్ సదా విఘ్నముల్
శితికంఠా! నినుఁజేరి భక్తిఁ గొలువన్ శ్రీరామలింగేశ్వరా! 18

మ. తతహేమాచలచాప! భక్తజనసంతాపార్తినిర్వాప! యా
తతవిభ్రాజపటుప్రతాప! నిగమాంతస్వైరసంచారరూ
ప! తమోపఘ్నకలాప! ధూతమదనప్రాగల్భ్యసద్రూప! ని
ర్జితబృందారకశత్రురూప! సురపా! శ్రీరామలింగేశ్వరా! 19

మ. సురసంఘంబులు గూడి యో పురహరా! సోమార్ధసచ్ఛేఖరా!
శరణో హో మము గావు మంచనుభవచ్చారిత్రముల్ బాడుచున్
కర మర్థిన్ నినుఁజేరి మ్రొక్క విష మాకర్షించి భక్షించి సు
స్థిరత న్వారలఁగాచి బ్రోచితివిగా శ్రీరామలింగేశ్వరా! 20

శా. పాపారణ్యకుఠారరూప మన త్వత్పాదంబు లిద్ధారుణిన్
రూపింపంగల మర్త్యు లెప్పుడు సదారోగ్యస్థిరాయుష్య స
ద్రూపైశ్వర్యము లంతకంత కభివృద్ధుల్ బొంద సన్మార్గులై
దీపింపంగలవార లై ప్రబలలేదే? రామలింగేశ్వరా! 21

శా. కామక్రోధముఖోగ్రశత్రుచయమున్ ఖండించు నీ నామమున్
వేమా రాత్మల నెంచు జాపకులకున్ వేయేల నిద్ధారుణిన్
కామం బాత్మహితంబు గోరి తిరుగు న్కైవల్య మెల్లప్పుడున్
శ్రీ మీరన్ వెనువెంట నంటి తిరుగున్ శ్రీరామలింగేశ్వరా! 22

శా. నీ సాధుత్వము నీ మహామహిమయున్ నీ సత్యసంధత్వమున్
నీ సాయుజ్యము నీ మహావిభవమున్ నీ మూర్తి సద్రూపమున్
ఓసామీ! వినుతింప నా తరమె యో యుగ్రాక్ష! విశ్వంభరా!
శ్రీసాంబా! కృపఁజూచి బ్రోవవలె నన్ శ్రీరామలింగేశ్వరా! 23

[సశేషము]

గ్రంథ సమీక్ష

శ్రీ శిష్టా బాలకోటీశ్వర రావు

1. ఉత్కళశ్రీ- సాక్షి గోపాలము; అర్వదినాలుగు
పుటలు వెల రు 1-00

2. ఉత్కళశ్రీ- శ్రీ జగన్నాథము; ఎనుబదియాఱు
పుటలు వెల రు 1-50

3. ఉత్కళశ్రీ- కోణార్కము; ఎనుబదినాలుగు పుటలు వెల రు 2-00

ప్రాప్తిస్థానము: బి. యస్. మూర్తి, బి. ఏ; సి. టి; టీచరు,
ఆగ్నేయరైల్వేహైస్కూలు,
ఖురదారోడ్డు
పూరీ జిల్లా (ఒరిస్సా)

ఈ మూఁడు పొత్తములు కవిసుధాకర బిరుదము నార్జించిన భళ్లమూడి నరసింహమూర్తి, బి.ఏ; సి. టి; గారిచే గ్రాంథికవచనమున రచింపఁబడినవి. ఉత్కళరాష్ట్రమునఁ గల సాక్షిగోపాల జగన్నాథ కోణార్క క్షేత్రములు సుప్రసిద్ధములు. ముముక్షువు లగు భారతీయులకు దర్శనీయములు. ఈ పుణ్యస్థలత్రయమునుగూర్చి యపురూపమైన చరిత్ర నెంతయుఁ బరిశోధించి పండితపామరులకు సంయుక్త మగునటులు వ్రాసి యాంధ్రదేశీయుల కందించిన మూర్తిగారి యభిలాష యుగ్గడింపఁదగినది. వీ రీగ్రంథములను వ్రాయుటకు కొంత పరిశ్రమ గావించిరి. ఈ క్షేత్రములను గుఱించి తెలియఁజేయు ననేకగ్రంథములను చదివి చర్చించి నిశ్చయించుకొన్నపిదపనే మూర్తిగారు వీనిని రచించి రనుటకు తమ పుస్తకములయం దిచ్చిన ప్రముఖరచనల పట్టికలే నిదర్శనములు.

సాక్షిగోపాలమునందలి ప్రస్తావనలో 'యథార్థబాహ్యము, విశ్వాసదూరము నగు నభిప్రాయము కొన్ని పాఠ్యపుస్తకములలో గూడ వ్రాయఁబడియున్న' దని నుడివి తాము వెల్లడించు కథల నరసి నచో సత్యము స్ఫురింపఁగలదని మూర్తిగారు తెల్పిరి. సత్యాన్వేషణా

సక్తి ప్రశంసనీయమే! సత్యము బాహిరింపవలె నని ప్రయత్నించిన వీరి 'సాక్షిగోపాలము' పఠించినచో లభించునది నిరంతరాయముగ వినిపించుచున్న మహాశ్చర్యకరకథాపరంపరయే! నిక్కువమేదో విస్పష్టముగ చూపఁగల యాధారము లేమియును లేవు.

ఇట్టి రచనలు చేయునపుడు భావావేశము కల్పనానురక్తి సుదీర్ఘ సమాసములు నుపయోగింపవు. సులభశైలిలో స్పష్టముగ వ్రాయఁగల నేర్పు మాత్రమే పాఠకులను రంజించును. "మంజులవంజుళకుంజ మంజరీమధురసధారలచే" "మానితమానినీమణీసుధాపూరవచోవిలాసములచే"- ప్రౌఢముగ నారికేళపాకమున రచింపవలెనని యాశించి ప్రారంభించిన "వృద్ధయిలవేలుపు, వృద్ధమహీవేలుపుపెద్ద, ప్రగాఢసక్తిక అల్పాతియల్పుడు, స్వర్ణకన్నెగేదఁగి, ద్వితీయనాడు, తృతీయనాటికి, దక్షిణబెంగాలు వంగలవంగులు, రాజబందుగులు" మున్నగునవి సంభవించి రచనను వికృత మొనరించును. ఆహారించు, బాహిరించు వంటి ప్రౌఢప్రయోగములందు వీరికిగల కాంక్ష శకటరేఫార్ధానుస్వారాదుల యందెందులకు లేదో తెలియదు. నియమబద్ధమైన భాషలో వ్రాయవలె ననిన సనాతనుల ననుకరించుట యొక్కటే చాలదు. ఆ యనుకరణముల నొరులు కనుఁగొనకుండఁ జేయఁగల పాటవము గూడ సంపాదింపవలెను.

ఏమైనను కవిసుధాకరులైన వీరు రచించిన యీ మూఁడు పుస్తకములు పఠితల నాకర్షించును. సుమారమున నున్న క్షేత్రత్రయముయొక్క ప్రఖ్యాతిని చదివి మోదించు కోరికగల 'పండితపామరుల' కివి యవశ్యపఠనీయములు. అచ్చటచ్చట సందర్భానుసారముగ ఛాయాచిత్రము లున్నవి. పుస్తకప్రాశస్త్యమును వెలార్చు పీఠికలు, రెండు మాటలు గూడ నున్నవి. "నిష్కళంకహృదయముతో నిర్వ్యాజభక్తితో" నిట్టి కృషి చేసి కృతార్థులైన భళ్లమూడి నరసింహమూర్తిగారు సమధికోత్సాహముతో ననల్పగద్యపద్యకావ్యములు నిర్మాణించి వాణి నర్చింతురని మా విశ్వాసము.

సంపాదకీయము

ఆంధ్రీకరణసమస్యాపూరణవిషయమున మేమిదివరలో సూచించి నిర్ధరించిన వ్యవధి పరిగణింపకుండ నింకను గొందఱు విలిఖించి పంపుచున్నారు. వానిని సక్రమపద్ధతిలో ముద్రింపించుటకు మాకు వీలు కలుగకున్నది. కష్టించి కవి రచించినయవి ప్రచురింపఁబడకున్న నతఁడుపడు మానసికవ్యథ నెఱుంగుటచే ప్రస్తుతము సంపాదకీయము విరమించి యకాలాగతము లగు నీ రెండాంధ్రీకరణసమస్యాపూరణముల నీదిగువ ప్రకటించుచుంటిమి. ఇటుపై మన మీవిధానమును విడనాడుట తప్పదు.

శ్రీ వారణాసి శ్రీహరిరావు, సాహితీసమితి, ఎలమంచిలి.

ఆ. వె. పరఁగ నల్లి దోమ బాధించు రేలను,
యాచకులును నీఁగ లెన్నఁ బవలు;
ఎఱ్ఱచీమ, భార్య యేప్రొద్దు పీడించు
శ్రీశవారణాసి శ్రీహరీశ.

మ. చెలి తా నన్యగృహంబు చేరుటను సచ్ఛీలంబు గోల్పోయె నీ
పలుగాకిన్ భరియింప; రావణునికొంపం జెడ్డ శ్రీ నేలు వెం
గలియా. రాముడ నేనుగాననుచు బల్కాఁర్యాతలం గూయు చాఁ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్ కాంతారసంవాసమున్.

"సాహిత్యవిశారద" డా. మల్లిబాబు, నరసాపురము.

తే. గీ. రేయి దోమలు నల్లులు రేఁగి బాడువ
పగలు నీఁగలు యాచకుల్ వ్యథ నొనర్ప
రేబవ ల్లొక్కరీతిగా రేఁగి మూఁగి
భార్యలున్ జీమలు మిగుల బాధ గూర్చు.

మ. కలిచేతన్ గొనిపోయె రావణుఁడు భూకాంతాత్మజన్, రాముఁడున్
గలిచేతన్ గొని తెచ్చె సీతను ప్రజాకళ్యాణకాంక్షారతిన్
కలిచేతన్ సతి నంపె కారడవికిన్ గాంతుండు శ్రీరాముఁ డౌ
కలిచేతన్ జనకాధిపాత్మజ గనెన్ కాంతారసంవాసమున్.

సంపాదకుఁడు
ప్రౌఢకవిచంద్ర, కాకరపర్తి కృష్ణశాస్త్రి.
సంపాదకసహాయుఁడు
శిష్ట్లా బాలకోటేశ్వరరావు.

కుతూహల జయజయ కాళియఫణిఫణారంగస్థలపటునటనాకృత కోలాహల జయజయ నీలాలకభృంగావృతజలరుహనిభముఖజితశశిమండల జయజయ సుభ్రూమదనశరాసనసంధీకృతసుమశరనిభలోచన జయజయ కాంచనకోరకవంచనచంచుసునాసాంచిత భవమోచన జయజయగోపీతాపనివారణసాధుసుధాపూరిత మధురాధర జయజయ కంఠవిడంబితకాంబవసౌభాగ్య మురాంతక ధృతభూధర జయజయ కమలాకుచతటకుంకుమచర్చాలంకృతవక్షోరాజిత జయజయ కలనిక్వణమణికంకణచారుకరాంబుజ దివిషత్పూజిత జయజయ మృదుతరనవబిసలతికాసంకాశభుజాస్తంభవిభాసుర జయజయ దామాంకితపటురేఖాసందేహదవళిభంగజితాసుర జయజయ నగనసమానవలగ్నాశ్రయరశనాధృతకింకిణిభూషణ జయజయ నిశ్చలవిద్యుల్లతికాసమచేలకటీతటమృదుభాషణ జయజయ దిగ్గజకరగురుశోభాచారూరుద్వయ వినతాఖండల జయజయ జానూన్నతినిర్జితకాంచనకాహళి సంహృతరిపుమండల జయజయ హరమకుటాంచద్గంగాజని కారణనిజపాదసరోరుహ జయజయ వైకుంఠాలయభక్తాశ్రియఫలవినమత్కల్పమహీరుహ జయజయ దీనత్రాణపరాయణ శాశ్వత పురుషోత్తమ జగదీశ్వర జయజయ దారోసబలసుభద్రాసహిత హరే మాం పాహి నిరీశ్వర. 76

చతుర్విధకందము.

సారసదళాక్ష జలదా
కారా నిహతారిజాల ఖగరాజహయా
ధీరాగ్రగణ్య జగదా
ధారా యహిశయన జలధితనయాసహితా. 77

త్రివిధకందము.

కరివరదా మునిదరదా
హరసఖ నరజనక యసురహర గిరిధర సా
గరతనయా ఘనకుచభూ
ధరపరశయ వనజనయన దరకర యభవా. 78

గీ. పతితపావన పరమేశ పరమపురుష
నతజనాదర నరసఖ నారసింహ
నీలగిరివాస నిరుపమ నిర్వికార
జయ జగన్నాథ జనగేయ జననరహిత. 79

లయగ్రాహి.
సారసదళాక్ష సురవారపరిరక్షణవి
చార నరకాసురవిదారక త్రిలోకా
ధార యఘసంచయవిదూర పదతాడితమ
హోరగ భవాంబునిధితారక వ్రజస్త్రీ
జార మునిమానసవిహార జలదాంచితశ
రీర గళశోభిమణిహార నవనీతా
హార ముఖకాంతిజితశారదశశాంక యదు
వీర జలరాశితనయారమణ శౌరీ. 80

శా. నీవే దైవతచక్రవర్తివి సభన్ నిన్నే ప్రశంసింతు నీ
చే విశ్వం బలరారు నీకొఱకు నే జేతున్ నమస్కారముల్
నీవల్లన్ భవముల్దొలంగు నెవరు న్నీకున్ సముల్గారయా
యావిర్భావము నందు లోకములు నీ యందే గదా యో హరీ.

క. అకలుషభక్తి జగన్నా
యకునిం బూజించి యాక్రియం బొగడుచు రా
జకుమారుఁ డందు దిరుగుచు
నొకనాడు ప్రయాణసముచితోద్యోగుండై. 82

గీ. అమృతగుండిగలును మనోహరపుటుండ
లిడ్డెనలు ఖండచక్రింబు లిష్టగంధ
భరితహరిసుప్రసాదముల్ భక్తి మెసగి
మును తరుణి గోలుపోయిన వనికి జేరి. 83

క. చని వని గని మునివృత్తిన్
దినములు గడపుచును దిరిగితిరిగి యొక శిఖా
వనతానోకహమూలం
బున గనదగు రాతిబొమ్మపోలుపు గని మదిన్. 84

ఉ. ఈ సిగ యీ మొగంబుసిరి యీ మధురాధర మీకుచద్వయం
బీ సునితంబమండలము లీ చరణాబ్జము లీ స్థిరాంగకం
బీ సొగ సెల్ల నా మదికి నెంచిన నిక్కము గాగ దోచె న
వ్వాసవదత్తరూపవిభవంబు సమం బగునంచు ఖిన్నుడై. 85

ఉ. తప్పక జూచి యా ప్రతిమ దగ్గర బోతో నృపాలశేఖరుం
డప్పుడు కేల నంటుకొన నమ్మహనీయశిలాలలామ తా
గప్పురగంధియై సభయకౌతుకవృత్తిని మ్రొక్కి సిగ్గుతో
నెప్పటియట్ల యుండ దన యింటిగదా యని సంభ్రమంబునన్. 86

గీ. అమృతపూరంబు గన్న తృష్ణార్తు నట్ల
బెన్నిధానంబు బొడగన్న పేద కరణి
సుందరీమణినెమ్మోము జూచి ధరణి
పాలకుం డంత సంతోషభరితు డగుచు. 87

ఉ. ఎచ్చటి కేగితే జలరుహేక్షణ యిట్టి శిలాత్వ మేటికిన్
వచ్చె నికుంజగేహమున న న్విడనాడ గతం బదేమి నా
కచ్చెరు వయ్యెడిం దెలుపుమా యన రాజుమొగంబు జూచి దా
నచ్చిగురాకుబోడి తెలియందగు దెల్పెద నంచు నిట్లనున్. 88

సీ. అటు నిద్రవోవు నీకన్న ముందుగ లేచి
ఫలసంగ్రహము జేయఁదలచి దూర
మరిగితి మీకు నభ్యవహార మొనరింతు
నను బుద్ధిబూని యో జనవరేణ్య

కిలకిలార్భటులతో గలయవచ్చు కిరాత
సేనల గని యందు మాని వచ్చి
వేరొక సేనానివేశంబు గని భీతి
వెనుకకుజని బిల్వ వెఱచి నన్ను

బట్టి తెమ్మని మాయయ్య పంపినట్టు
సేనలో గానలో మిమ్ము జేరుపట్టి
యాపురిలో యని యూహింప నా క్షణంబ
యుభయసేనాధిపతులు నా యునికి దెలిసి. 89

క. ఏకామిమసంప్రాప్తికి
దీకొను గృధ్రంబు లట్ల దీవ్రగతులచే
నా కలుషాత్మకు లిద్దరు
నా కొఱకై ఘోరరణ మొనర్చిరి కడకన్. 90

క. వీరభటారభటీదు
ర్వారశరాసారఘోరవర్షధనుష్టం
కారపదాతిచమూఘీం
కారముల నజాండ మెల్ల గంపము నొందెన్. 91

సీ. తవతురంగమపదోద్ధతి చేత జనియించి
త్క్ష్మాపరాగంబు మేఘు మన దనరె
త్క్ష్మాపరాగంబు మేఘుచ్ఛాయ దనరార
ప్రబలమై బాణవర్షంబు గురిసె
ప్రబలమై బాణవర్షము విరాజిల్లిన
గలహభుక్చాతకక్షామ మెడలె
గలహభుక్చాతకక్షామంబు దీరిన
సమరకాంతావివాహంబు లయ్యె

నట్లు యద్భుత మొదవె యూథాధిపతులు
పరశుపట్టసముద్గరప్రాసచక్రి
భల్లకరవాలఫలకవిభ్రాజమాన
హస్తులై డాసి చెలగి పోరాడునపుడు. 92

చ. విఱుగు రథంబులుం బొడలు వెట్టుక బంధములున్ ధరిత్రి బె
ట్టొఱగు గజంబులుం బదము లూఢగ దోచక భీతి దిక్కులం
బఱచు హయంబులున్ శరనిపాతసముద్గతరక్తవర్షము
ల్గొఱల నటించు వీరభటులుం గలుగన్ రణ మొప్పె నయ్యెడన్.

సీ. చలనీలభూధరసంకాశవేదండ
కాండముల్ మేఘసంఘములు గాఁగ
జితవర్ణాంకవిశేషితధ్వజనూత్న
పటకాంతు లింద్రచాపములు గాఁగ
బటురణోద్భటవీరభటసింహనాదముల్
రమణీయగర్జారవములు గాఁగ
కరవాలచకచకస్ఫురితదివ్యపరిఘ
ల్లలితసౌదామనీలతలు గాఁగ

వరధనుఃప్రేరణంబున జోరచునట్టి
శరపరంపర ఘోరవర్షంబు గాఁగ
బ్రావృడారంభసంరంభభరిత మనుచు
బొల్ప నొప్పారె నమ్మహాద్భుతరణంబు. 94

సీ. హరిహరి యనుచు నంబరవీథి నానంద
భరితుఁడై సురమౌనివరుఁడు దిరిగె
దగు భూషణములు నూతనములై కనుపట్ట
భూతనాథుండు సొంపుగ నటించె

నభినవప్రియసంగమాత్యంతరతి జెంది
యప్సరస్త్రీనికాయంబు పొదలె
నాకలి దీర నొయ్యారంబుతో భూత
బేతాళగణములు పేర్చి యార్చె
గొండలై యున్న యామిషఖండములును
దొఱగు రక్తస్రవంతులు ద్రుళ్లు తలలు
దెగిన భుజములు ధారుణి ద్రెళ్లు కాళ్లు
ప్రోవులై పడ్డ ప్రేవు లద్భుతము సేయ. 95

వ. అట్ల. 96

గీ. ఉభయబలములు పోరాడుచుండు నంత
నచట కేతెంచె యోగవిద్యావిశేష
కరతలాంచితజపమాలికామనోజ్ఞ
మూర్తియై యొప్పె నొక సిద్ధమునివరుండు. 97

సీ. పటుజటాజూటంబు భసితత్రిపుండ్రంబు
గండలంబితతామ్రకుండలములు
ధవళయజ్ఞోపవీతంబులు గాంచన
యోగపట్టికయు శాతోదరంబు
దీర్ఘకూర్చం బనిందితతనూవిభవంబు
బదముల మణిమయపాదుకలును
కరమున జలకుండికయు నాగబెత్తంబు
శ్రుతితలద్విగుణాక్షసూత్రకంబు
గలిగి యడుగిడి యడుగిడి నలిననాభ
చక్రిహస్త మురాంతక శ్యామలాంగ
కృష్ణ కేశవ పాహి లక్ష్మీశ యనుచు
నమ్మునీంద్రుండు వనికి డాయంగ నరిగి. 98

క. చారణవినుతుం డమ్ముని
మారణకృత్యంబు లొదవె మద్వనిలో నే
డీ రణ మొనరించుటకుం
గారణ మిా సారసాక్షిగా యని కడకన్. 99

క. అంతేవాసులు గొలువగ
నందే తన యాశ్రమమున కేగుచు రోషా
త్యంతకషాయత చలనే
త్రాంతుం డై నన్ను జూచి యలుకం బలికెన్. 100

మ. రమణీ యెవ్వతె వివ్యసస్థలికి జేరం గారణం బేమి యీా
సమరం బంతయు నీ కతంబునగదా జన్మించె నస్మద్వనాం
తము నీ రాకనె భగ్న మయ్యె నిక సౌందర్యంబుతో డన్ శిలా
త్వము గై కొ మ్మని శాప మిచ్చినను జింతం జెంది యే నంతటన్.

మ. అనఘా మత్పతి నిద్రవోవ ఫలమూలాన్వేషణార్థంబు నీ
వనికిన్ వచ్చితి నన్ను జూచి జనితవ్యాపాదు లై వీర లీ
ఘనయుద్ధం బొనరింపగా దొడగి రో కారుణ్యపూర్ణాత్మ యిం
కను శాపావధి దెల్పి నన్ను గృపతో గావంగ దే వేడెదన్. 102

గీ. అనిన విని యమ్మునీంద్రుండు గినుక మాని
నన్ను దయజూచి యి ట్లను నలినవయన
నీ ప్రియుం డిందు జనుదెంచి నీ శరీర
మంటికొన గల్గు జైతన్య మపుడు నీకు. 103

శా. ఆ రీతిన్ మునిరాజు పల్కి చనె దా నట్లైతి నంతన్ నృపుల్
పోరాటంబులు మాని యిద్దఱును దత్పుణ్యాటవీవాటికా
దూరక్షోణికి బోయి రెంతయును నిర్ఘాతాశు లై తావక
శ్రీరమ్యాంఘ్రులు చూడగంటిని ధరిత్రీవల్లభా నేటికిన్. 104

వ. అని యవ్వనిత తన వృత్తాంతఁ బెఱిగించిన విని రాజు వికసిత
నేత్రారవిందుండును బ్రమోదమేదురస్వాంతుండును నై యున్న
యెడ నచ్చోటికి మకరందుండును తత్ప్రియసఖులునుం జనుదెంచి
సంతత నమ్మహీకాంతుండు నిజపురాభిముఖుండై జనుచుండె నటమీఁది
వృత్తాంతంబు. 105

మ. శమితస్వాంతరమిత్ర మిత్రనిభతేజఃపుంజప్రతా
పమహత్వస్థిరగాత్ర గాత్రిఘహరప్రఖ్యాతిమత్పుణ్యథా
గ్యమితోద్యద్గుణపాత్రి పాత్రిధికసద్వ్యాపారబాహాగ్రసం
భ్రమలీలాధృతగోత్ర గోత్రరిపుపౌరశ్రీలసచ్ఛాత్రివా. 106

క. నీలఘనాఘనగర్జా
కోలాహలవాక్ప్రచండ గురుగుణకాండా
లీలావతీమనోభవ
లీలాదండోడుమండలీకరగండా. 107

పంచచామరము.
సరోరుహాక్ష పాదసారసద్వయీవిభావనా
ధరాసురాగ్ర తుల్యదాన ధారుణీ ధురంధరా
సురాపగా పటీరహీరశుభ్ర కీర్తిభాసురా
చరత్రికాండ దండితారి జాల సద్గుణాంచితా. 108

గద్య

ఇది శ్రీ వక్కలంక చంద్రశేఖరమహాకవిపౌత్ర భాస్కర
సుకవిపుత్రి విద్వజ్జనవిధేయ వీరభద్రినామధేయవిర
చితం బైన వాసవదత్తాపరిణయం బను మహా
ప్రబంధంబు నందు చతుర్థాశ్వాసము

శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు.

వాసవదత్తాపరిణయము

పంచమాశ్వాసము

శ్రీలావణ్యవతీకర
ణాలబ్ధైశ్వర్యధుర్య నగధైర్య దిగం
తాలంకృతనిజగుణమణి
జాలా మాధవనృపాల జననుతశీలా. 1

వ. అవధరింపు మనంతరకథాక్రమం బట్టియెడ గుసుమపురంబులోన. 2

క. చందనకవాటవరసం
క్రందనమణికుడ్యవజ్రికమనీయధరా
వందనమాలాంచిత మగు
కుందనపుంబనుల కొలువుకూటములోనన్. 3

సీ. ఒకచెంత వీరరాహుత్తగణంబుల లోన
వందిబృందంబులు సందడింప
నొకదండ దండనాయకులలో బరమన్నె
రాయబౌరులు ఘనప్రతిభ మెఱయ
నొకచెంత బంధురాజకుమారవితతిలో
హితపురోహితచమూపతులు మెఱయ
నొకపజ్జ శాస్త్రజ్ఞనికరంబులో మహా
కవిసార్వభౌములు కడక నమర
గనకకంకణఝణఝణత్కార మెసఁగ
రమణు లిరుచక్కియల చామరములు వీవ
జెలువుమీఱంగ శృంగారశేఖరుండు
హాళి బేరోలగం బున్న యవసరమున. 4

చ. ముఱిపెపునెన్నడన్ జఘనము ల్గనుపట్ట నితంబమండలిన్
మెఱయు సువర్ణమేఖల సముజ్జ్వలమై దనరార జెక్కులం
దొఱగెడు ఘర్మబిందువులతో వదనాబ్జము వాడుజూపగా
బిఱబిఱ నేగుదెంచె నొక బిత్తరి యుత్తరి దత్తరించుచున్. 5

ఉ. వచ్చిన కొల్వుసాలపెదవాకిలిచెంత నృపాలశేఖరుం
డచ్చిగురాకుబోణి వదనాబ్జము గన్గొని యింగితజ్ఞుఁడై
యచ్చటివారి నేగు డని యంతిపురంబున కేగి గుంపులై
యచ్చెరు వొందు సుందరుల సందడి గన్గొన వారు రాజుతోన్. 6

క. ధరణీశ యెవఁడో యంతః
పురమున కేతెంచి నిఖిలమోహనమాయా
గురుబలుఁడై జలజాస్యం
దరుణిం గొని చనియె నీసుతన్ నిర్భీతిన్. 7

ఉ. చిత్రము పోతుటీగయిన జేరగనోప దటంచు దెల్పగా
వృత్రహుఁడో మహేశ్వరుఁడో విష్ణుఁడో ధాతయొ గాక భూమిభృ
న్మాత్రుని కిందు జేరదగునా యని యద్భుత మంది యందఱున్
నేత్రములందు నశ్రువులు నించి వచించిన జంచలాత్ముఁడై. 8

చ. కుసుమపురీశ్వరుండు దన కూతువిధం బవరోధభామినీ
విసరము దెల్ప శోకభరవిహ్వలుఁడై కడుచింత నొంది తా
దెసలకు బంపువెట్ట నతిధీరుల ధీరత మీఱి నేడు మీ
రసదృశభంగి పట్టి నరయందగు నంచు వచించి యంతటన్. 9

క. చారుగుణయుతులు విమలా
చారులు చారులు నృపాలుచరణంబులకున్
జేరి నతిజేసి యపుడు ర
యారూఢమనస్కు లగుచు నరిగిరి కడకన్. 10

సీ. వైజయంతీసముజ్జ్వలమణిప్రాసాద
బహుళనానాదేశపట్టణములు
శుకపికశారికానికరకోలాహల
ప్రకటితకాననాభ్యంతరములు
గంధరామందిరాంగణనటత్కిన్నర
గానమనోహరక్ష్మాధరములు
మల్లికావల్లికావేల్లితసుమకుంజ
మదభృంగతతనదీనదతటములు

వెదకి వెదకి వింధ్యవిపినమార్గంబున
జనిన రాజకన్యజాడ లచటి
వారి వలన నెఱిగి వార లంతట గొన్ని
దివసములకు రాజసవిధమునకు. 11

గీ. చేరి ముకుళితహస్తులై వార లపుడు
ధారుణీనాథ విూ పట్టి దారి పట్టి
చని కనుంగొంటి మవ్వింధ్యశైలనికట
గహనపథమున నిజచమూసహితు డగుచు. 12

క. కందర్పకేతునృపనం
క్రందనుడు భవత్తనూజ గైకొని హృదయా
నందంబునఁ సఖు డగు మక
రందుని తో గూడి నిజపురంబున కరిగె. 13

క. చనుచున్నవాడు తథ్యం
బన విని యమ్మేదినీశు డనుమోదించెన్
ఘనహిత బాంధవలలనా
జనములు సంతసము గాంచి సరసత మెఱయన్. 14

సీ. బాంధవం బొనరింప భాషింప సములకే
తగు గాని యొరులకుదగదు గాన
రారా జతండు నే రాజ నాతనితోడ
సముడ గా నను లజ్జ సంభవింప
జర్చింపనైతి వాసవదత్త గంధర్వ
కేతునకును బెండ్లి సేతు ననుచు
మత్పురాకృత పుణ్యమహిమచే నతనికి
సుత నిచ్చి ఘనుడనై చూడగంటి

నిపుడటకు బంపవలె బురోహితుల ననుచు
ధరణిపతి మంత్రితో మంతన మొనర్చి
హితుల కెఱిగించి నీతిసంయుతుల విప్ర
పుంగవుల బిల్వబంపి యుప్పొంగి యవుడు. 15

గీ. విప్రులార వింధ్యవిపినమార్గంబున
మత్తనూజ గొనుచు జిత్త మలరి
చనెడు రాజమౌళి జనమాన్యు బాటలీ
పుత్రవిభుని కడకు బోయి మీరు. 16

మ. రమణిన్ వాసవదత్త మత్తనయ శాస్త్రప్రోక్తరీతిన్ వివా
హముగావించెద మెల్లి లగ్నమని మేమన్నట్లుగా బల్కి చి
త్తమురంజిల్లగ జేసి మాయెడ నితాంతప్రీతి పుట్టించి నే
రము లెల్లన్ క్షమియించుమా యని నృపుం బ్రార్థించి ధీచాతురిన్.

క. నా విన్నపంబు తగన
బ్భూవిభునకు దెలిపి కుసుమపురిని వివాహ
శ్రీవిభవము గైకొనుటకు
రావలె నని తోడుకొనుచు రావలె నిటకున్. 18

మ. అనినన్ వేడుకతోఁ బురోహితులు వింధ్యక్షోణిభృత్ప్రాంతభూ
వనమార్గంబున కేగి కాంత గొని కేవన్ బాటలీపుత్రద
ర్శనబుద్ధిం జనుచున్న రాజు గని ధీచాతుర్య మేపారగా
వినుతుల్ సేయుచు డాయగా జనిన యవ్విప్రోత్తమశ్రేణికిన్. 19

ఉ. మ్రొక్కి బహూకరించి నృపముఖ్యుడు నిల్చి మహాత్ములార మీ
రెక్కడనుండి వచ్చితిరి యేగెద రెచ్చటికన్న వారలుం
గ్రక్కున మంత్రపూర్వకముగా గయి దాల్చిన యక్షతంబులన్
మిక్కిలి వేడ్కచే నృపునిమీద ఘటించి కరంబు లెత్తుచున్. 20

గీ. క్ష్మాపతిని పెల్లి కొడుకవు గమ్మటంచు
దీవన లొసంగి తమ రాక దెలిపి కుసుమ
పురివిభుడు విన్నవించినకరణి బల్కి
దమ పురికి దెచ్చి లథిపు నద్ధరణిసురులు. 21

వ. అప్పుడు.

సీ. మకరందుడు నిజానుమతిని సంతస మంది
తగ బాటలీపుత్ర నగరమునకు
ఫణిహారులను బంపి బాంధవభటమంత్రి
హితచమూపతిపురోహితుల నెల్ల
రావించుటయు దూర్యరవ ముల్లసిల్లంగ
వందిబృందము మోద మంది పొగడ
గరితురగాందోళికాచ్ఛత్రచామర
ధ్వజముఖ్యలాంఛనతతులు మెఱయ
గుసుమపురపుష్పితోద్యానకుంజమంజు
పరిసరక్షోణికల్పితపటగృహాంత
రాళమున బ్రాభవం బలరంగ విడిసె
ఖ్యాతచరితుండు కందర్పకేతువిభుడు. 23

ఉ. రాజిత కీర్తిశాలి మకరందుడు వేడుకతోడ నయ్యెడన్
రాజవివాహ మెల్లియగు రావలె మీ రని బిల్వఁబంచినన్
రాజకుమార శేఖరులు రమ్యవిభూషణభోజ్యల న్మణీ
రాజుల గాన్కఁగొంచు నెదురం జనుదెంచిరి సంతసంబుతోన్. 24

క. సమధికమతు లవ్విప్రో
త్తము లవ్విభునాజ్ఞ జని ముదంబలర నను
క్రమముగ దెలుపగ విని సం
భ్రమమున శృంగార శేఖరప్రభుడంతన్. 25

క. మది ముద మొదవగ సుదతుల
సదనము లలరింపబనిచె సరభసగతితో
ద్రిదివప్రభునిభు డై యప
డెదురుగ జన దలచియున్న నెలమిదలిర్పన్. 26

సీ. శ్రితు లమాత్యులు బంధుతతులు పురోహితుల్
దైవజ్ఞులు సమాన ధరణిపతులు
శృంగారవతులు తురంగమారూఢులు
వేత్రహస్తులు దొరల్ వీరభటులు
నాందోళికాగజస్యందనవాహనుల్
చామరధ్వజసితచ్ఛత్రకరులు
వీరకాహళభేరికారవప్రకటిత
తూర్యనిస్వనసముద్యోగచణులు
వెలగి తను గొల్వ శృంగార శేఖరుండు
మదిని వెలరేగి పెండ్లికుమారు బిల్వ
నెదుపగా నేగుటయు బురోహితులు పెండ్లి
వారితోడ నెదుర్కొనవలయు ననిన. 27

వ. అంత నవ్విధంబున నవ్వైవాహికు లిరుగెలంకులం దలంకక నిలిచి పటహఝర్ఝరఝల్లరీభేరీకాహీరకాహళాదివిరావంబు బధిరీకృత హరి దంతదంతావళంబై రోదోంతరంబు నిండి ప్రావృడారంభవేళాసము జ్జృంభితాంభోధరఘోష ననుకరింప నొండొరులు చండకరమం డలతేజః పిచండిలమణికుండలమండితగండద్వయీచాకచక్యహార కేయూరాదిభూషావిశేషభూషితులును భూషితాశేషవస్తువాహ నసంపత్ప్రశస్తి విస్తారితనిస్తులాస్తోకమహిమాభిరాములును మహి మాభిరామసామగ్ర్యసమాసాదితసామంత సీమంతినీ విరచితోప చారసౌభాగ్యధురంధరులు నై గంధసింధురబంధురమంధరగ మనంబులతో మందమందచందనాచల మరుత్కందళకాందిశీకశ్రమ బిందుసుందరవదనేందు కందళితమందహాసవిలాసభాసురలీల నల రుచు సుగంధబంధురగంధచూర్ణంబులు జల్లులాడుచు సల్లలితసరస సల్లాపంబుల నృత్తగీతవాద్యహృద్యవేణువీణారవాకలనంబుల నా నందింపుచు నెదుర్కొను సమయంబున నస్తాచలాగ్రప్రత్యగ్రవప్ర రాగదేదీప్యమానరుచిరరుచిరచ్ఛాయావల్లభుండును పూర్వాచల సౌధాగ్రసముత్తుంగమంగళవజ్రకలశసంకాశకాంతి నోషధీకాంతుం డునుం దదీయభవ్యప్రతాపమంజులకీర్తిపుంజంబులుమూర్తీభవించిన చందంబున దన్మహోత్సవవిలోకనసముత్సుకులవిధంబునం గొంత సేపు నిల్చుటయునంత సమస్తమహీభృందగీకృతాంబరమణిమండలంబును నరుణాంగరాగరంజితఘనాభిరామంబును దరుణతమస్ఫురణంబును దారావిరాజమానంబును సముద్దీపితచంద్రజ్యోతిఃప్రకాశంబును. నై యంబరంబు నవనీతలంబు నొక్క విధంబున నుండ గరదీపికా సహస్రసముద్దీపితచిరత్నరత్నసూత్నప్రకాశంబును దురంగతరంగ సంగతంబును గరటిఘటానకాప్రవక్రింబును శతాంగనౌకాసంగ తంబును శిబికారూఢవైవాహికసాంయాత్రికంబును నై యబ్ లాంబురాశి పురేందిరావిలోకనకుతూహలంబునం జనుదేర శ్రీవత్స

లాంఛనలాంఛితుండును విశేషాంచితనిజవిగ్రహుండును శ్రీలాలో
లీలాలాలితుండును వాహినీప్రభుమధ్యసంస్థితుండును నగు నవ్వార
పుండరీకాక్షునిపై ప్రాసాదాగ్రంబులపై నిలచి పుణ్యకాంతావతం
సంబులు చల్లు లాజవ్రజంబు సాధయూధమంధరశిఖరపరాహత
నాసీరపారావారపయోబిందుసందోహంబు చందంబున నందంబై
సముత్ఫుల్లమల్లికానుకారంబుతో దోరంబుగా సేనాపరాగవారివా
హకరకావర్షంబు ననుకరించ నాశీర్వచన పూర్వకంబుగా నుర్వీసు
పర్వసార్వభౌములు సర్వసర్వంసహాధూర్వహుం డగు నమ్మనుజ
వల్లభునిపై సమ్మదంబున నార్ద్రాద్రిహారిద్రాముద్రితాక్షతంబులు
గుప్పిన నవి చెవ్వరంబుగ నుప్పరం బెగసి కుప్పకుప్పలై యొప్పా
లకుప్ప యగు నప్పుడమిరేనిపై గప్పిన దుప్పటంబుపై గప్పి తదీయ
సౌవర్ణఛాయాదాయాదంబులై యంబరంబున నిలిచి తన్మహోత్సవ
వీక్షాదక్షులై వచ్చి వియచ్చరు లిచ్చమెచ్చి విచ్చలవిడిం గురియిం
చిన కాంచనకుసుమవర్షంబుడంబు విడంబింపుచు నవ్వ డావిభుండు
పురాభ్యంతరంబునం జను నవసరంబున. 28

చ. ప్రమదముతోడ నే నెలఁగు భామిని సీతనికన్నరీతి సం
భ్రమమునఁ జాసి యొండొరులపై బడుచుం దమి హెచ్చ నయ్యెడన్
రమణులు పద్మరాగమణిరాసులమిద్దికి నెక్కి నిక్కి భూ
రమణుని జూచుచుండిరి పురస్థమణీవిఫణిస్థలంబులన్. 29

చ. దళముగ నీలరత్నములు దాచినవిప్పుకు మేడమిద్దెదటం
గలికియొకర్తు భూవిభునిగన్గొన సోరణగంటిచెంగట
న్నిలిచిన దద్గృహంబలరె నిశ్చలవిద్యుదురుప్రకాశతం
బొలిచిన నీలమేఘమన నొప్పుగ నప్పట్టణరాజవీథిలోన్. 30

శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు

*1	సంపుటము	...	...	...	15–
*2	,,	...	...	...	15–0
3	,,	...	...	...	15–0
4	,,	...	...	...	15–0
5	,,	...	...	...	15–0
6	,,	...	...	...	15–0
7	,,	...	...	...	15–0

* పునర్ముద్రితములు గానున్నవి.

ప్రతులకు :

ఆంధ్ర సాహిత్య పరిషత్తు (రిజిష్టర్డు)

రామారావుపేట

కాకినాడ

తూర్పుగోదావరిజిల్లా.

Edited by K. Krishnasastry, Published by Andhra Sahitya Parishat and Printed by J. Gopalam at Republic Press MainRoad, Kakinada